# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 86 పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం -28- మార్చి- 2025


## తెలంగాణపై కేంద్రం చిన్నచూపు.. కేటీఆర్ ఫైర్

- తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై అసెంబ్లీలో కేటీఆర్ చర్చించారు.
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చింది కూడా గుండుసున్నా అని విమర్శలు
- ఈ ఏడాదిలోనే కాంగ్రెస్ రూ.1.58లక్షల కోట్ల అప్పు చేసిందని కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.



హైదరాబాద్: తెలంగాణను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది.. కానీ రాష్ట్ర బడ్జెట్‌లో మాత్రం ఆ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ పథకాలను కేంద్రం అనుకరిస్తోందని అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడకపోవడం బాధాకరంగా ఉందని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై అసెంబ్లీలో కేటీఆర్ చర్చించారు. రాష్ట్ర బడ్జెట్ చూస్తే ఆశ్చర్యమేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించే మీరు.. కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని కేటీఆర్ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో తమకు వచ్చింది సున్నా అయితే.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చింది కూడా గుండుసున్నా అని విమర్శలు చేశారు. కొట్లాడకపోతే కేంద్రం నిధులివ్వదు.. పోరాడాల్సిందేనని చెప్పారు. కేంద్రంపై పోరాడేందుకు రేవంత్ ప్రభుత్వానికి తాము మద్దతిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఇదే ఫస్ట్‌టైమ్.. అసెంబ్లీలో
# హైవోల్టేజ్ కామెంట్స్..

- ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ తీవ్ర ఆరోపణలు
- మేం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే.. రూ.20,615 కోట్ల రుణమాఫీ చేశాం.
- రైతుల ఉచిత కరెంట్ కోసం రూ.33వేల కోట్లు ఖర్చు చేశాం.




హైదరాబాద్, మార్చి 27: తెలంగాణ అసెంబ్లీలో వాడి వేడిగా చర్చ జరుగుతోంది. మునుపెన్నడూ లేని స్థాయిలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఇటు నుంచి సీఎం రేవంత్ రెడ్డి.. అటు నుంచి కేటీఆర్ ఒకరొకరు కౌంటర్లు ఇస్తూ సభను మరింత రక్తి కట్టించారు. తొలుత మాట్లాడిన కేటీఆర్.. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం తీవ్రంగా స్పందించారు. కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కక్ష సాధింపులకు

## ఉప ఎన్నికలు రాబోవన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు పాడి కౌశిక్ రెడ్డి కౌంటర్



- తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయన్న కౌశిక్ రెడ్డి
- సుప్రీంకోర్టు మీద పూర్తి నమ్మకముందన్న పాడి కౌశిక్ రెడ్డి
- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందని ధీమా

తెలంగాణలో ఉప ఎన్నికలు రాబోవన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు.

# నేడు పోలవరంలో చంద్రబాబు పర్యటన

- నిర్వాసితులతో ముఖాముఖి
- నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా
- ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని మండిపడ్డారు.
- పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ. 2,500 కోట్ల ఆదాయం వచ్చేదన్నారు.




అమరావతి : "పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను కోరుతున్నా. అందుకు అవసరమైన సిబ్బందిని ఇస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం నిర్వాసితులతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

**ఖర్చుచేసే ప్రతిపైసా నిర్వాసితులకే చెందాలి...**

2014లో తాము అధికారంలోకి రాకముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారని

## మోదీ ఆహ్వానం మేరకు
# ఇండియాకు వస్తున్న పుతిన్

- గత ఏడాది జులైలో రష్యాలో పర్యటించిన మోదీ
- భారత్ కు రావాలంటూ పుతిన్ కు ఆహ్వానం
- పుతిన్ భారత్ పర్యటనకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్న రష్యా విదేశాంగ మంత్రి



ఢిల్లీ: రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇండియా పర్యటనకు వస్తున్నారు. భారత్ పర్యటనకు రావాలంటూ ప్రధాని మోదీ చేసిన ఆహ్వానాన్ని పుతిన్ అంగీకరించారని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ తెలిపారు. పుతిన్ భారత్ పర్యటనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. 'రష్యా అండ్ ఇండియా: టువార్డ్ ఏ బైలేటరల్ అజెండా' పేరుతో రష్యన్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ నిర్వహించిన కాన్ఫరెన్స్ లో లావ్రోవ్ మాట్లాడుతూ ఈ మేరకు వివరాలను వెల్లడించారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత

## ఆ ఒక్క మెసేజ్‌తో రంగంలోకి దిగిన
# మంత్రి నారా లోకేష్




- లోకేష్ సేవాగుణంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.
- గుంటూరు నుంచి తిరుపతికి గుండెను తరలించడానికి సొంత ఖర్చులతో మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానం ఏర్పాటు
- సుష్మ గుండెను తిరుపతిలోని మరొకరికి అమర్చనున్నారు.

గుంటూరు జిల్లా: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సోషల్ మీడియాలో తన దృష్టికి వచ్చిన సమస్యలపై వేగంగా స్పందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్నారు. లోకేష్ సేవాగుణంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా.. లోకేశ్ క్షణాల్లో స్పందించడంతో ఒకరికి అవయవ దానం, మరొకరికి ప్రాణదానం జరగనుంది. గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ బ్రెయిన్ డెడ్‌కు గురి అయ్యారు. దీంతో సుష్మ కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను దానం చేయడానికి నిర్ణయించుకున్నారు. సుష్మ అవయవదానంతో

## మన ప్రభుత్వం వచ్చింది
# - పోలవరం పూర్తి చేసుకుందాం: సీఎం

- పోలవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన
- ప్రాజెక్టు నిర్వాసితులతో భేటీ
- 2027 నాటికి పునరావాసాలు పూర్తి చేస్తామని వెల్లడించారు.
- మీ ప్రభుత్వమని, బాధితులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ
- రైతులు త్యాగం చేసి పోలవరం కోసం భూములు ఇచ్చారని గుర్తుచేశారు.




అమరావతి : పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. రైతులు త్యాగం చేసి పోలవరం కోసం భూములు ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం సందర్శనలో భాగంగా తొలుత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు ప్రాంతాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు హెలిప్యాడ్ సైట్ వద్ద పోలవరం నిర్వాసితులతో మాట్లాడారు. ప్రాజెక్టుకి భూములిచ్చిన రైతులకు మొదట్లో చాలా తక్కువ పరిహారం ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. నిన్న మొన్నటి వరకూ నిర్వాసితులను పట్టించుకున్న నాథుడు లేడని విమర్శించారు. పోలవరం పూర్తి కోసం ఏడు మండలాలు ఏపీలో కలపాలని అప్పట్లో మోదీని డిమాండ్ చేశానని గుర్తు చేశారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 10 లక్షలు పరిహారం ఇస్తానన్నారన్న సీఎం, జగన్ అధికారంలోకి వచ్చాక పైసా కూడా విదల్చలేదని ఆరోపించారు. వరదలు వచ్చినప్పుడు కూడా అప్పటి

## కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటన

- నేడు పలు గ్రామాల్లో ప్రజలను కలిసిన వైనం
- ప్రజలు కాస్త ఓపిక పట్టాలని... చంద్రబాబు చెప్పినవన్నీ చేస్తారని స్పష్టీకరణ

అమరావతి : ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు పాలనా సామర్థ్యం గురించి రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పారిశ్రామికవేత్తలు ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారంటే అందుకు చంద్రబాబు గారిపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. రెండో రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో



భాగంగా మోడల్ కాలనీ, కృష్ణదాసపల్లి, జరుగు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. మహిళలు తమపై తాము నమ్మకం పెట్టుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు.

**కాస్త ఓపిక పట్టండి!**

ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు సాధ్యం కాని హామీలు ఇస్తారు. కానీ చంద్రబాబు గారు చెప్పారంటే చేతల్లో చేసి చూపిస్తారు. ప్రజలు కాస్త ఓపిక పట్టాలి. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి. ఒక ఇండస్ట్రీ తీసుకురావాలంటే అంత ఆషామాషీ కాదు. 2019 తర్వాత చంద్రబాబు గారు

# ఆ ఒక్క మెసేజ్‌తో రంగంలోకి దిగిన మంత్రి నారా లోకేష్

మొదటి పేజి తరువాయి

తిరుపతిలో మరొకరికి ప్రాణదానం జరుగనుంది. సుష్మ గుండెను తిరుపతిలోని మరొకరికి అమర్చనున్నారు. గుంటూరు నుంచి తిరుపతికి గుండెను తరలించడానికి సొంత ఖర్చులతో మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. ఇవాళ(గురువారం) రాత్రి 7 గంటలకు గ్రీన్ ఛానెల్ ద్వారా గుండెను గుంటూరు రమేష్ ఆస్పత్రి సిబ్బంది తిరుపతికి తరలించనున్నారు. దీంతో గుండె మార్పిడి విజయవంతం చేయడానికి వైద్యులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. సకాలంలో స్పందించిన మంత్రి నారా లోకేశ్‌కు సుష్మ కుటుంబ సభ్యులు, రమేశ్ హాస్పిటల్స్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణపై కేంద్రం చిన్నచూపు.. కేటీఆర్ ఫైర్

మొదటి పేజి తరువాయి

తెలంగాణకు కేంద్రం ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వలేదని అన్నారు. పసుపు బోర్డుకు కేంద్ర బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదని చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కోసం ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారు.. కానీ తెలంగాణలోని పరిశ్రమలను మాత్రం మూసివేస్తారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. అసహాయ మంత్రులుగా మిగిలారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలోని ఆలయాలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. సమ్మక్క - సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కుంభమేళాకు కేంద్రం నిధులు ఇస్తుంది.. సమ్మక్క సారలమ్మ జాతరకు ఎందుకు నిధులు ఇవ్వరని ప్రశ్నించారు. మనం అడగకపోతే కేంద్రం నిధులు ఇవ్వదని అన్నారు. పదేళ్లలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని ప్రచారం చేశారన్నారు. తమ హయాంలో ఏడాదికి రూ.40వేల కోట్లు మాత్రమే అప్పు చేశామని తెలిపారు. అప్పు చేసి అభివృద్ధి చేశాం.. ఇదే విషయాన్ని కాగ్ చెప్పిందని గుర్తుచేశారు. ఈ ఏడాదిలోనే కాంగ్రెస్ రూ.1.58లక్షల కోట్ల అప్పు చేసిందని కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ధాన్యం ఉత్పత్తిలో 2022లోనే హర్యానా, పంజాబ్‌ను తెలంగాణ మించిపోయిందని ఉద్ఘాటించారు. సాగుకు ఉచిత విద్యుత్ కోసమే రూ.61వేల కోట్లు ఖర్చు చేశామని కేటీఆర్ తెలిపారు.

# మోదీ ఆహ్వానం మేరకు ఇండియాకు వస్తున్న పుతిన్

మొదటి పేజి తరువాయి

మోదీ తొలి అంతర్జాతీయ పర్యటన రష్యాలో చేశారని చెప్పారు. గత ఏడాది జులైలో మోదీ రష్యాలో



పర్యటించారు. ఈ సందర్భంగా భారత్ లో పర్యటించాలని పుతిన్ ను మోదీ ఆహ్వానించారు. అమెరికా టారిఫ్ ల ముప్పు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుకు సంప్రదింపులు జరుగుతున్న తరుణంలో పుతిన్ భారత్ లో పర్యటించనుండటం గమనార్హం.

# ఉప ఎన్నికలు రాబోవన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు పాడి కౌశిక్ రెడ్డి కౌంటర్

మొదటి పేజి తరువాయి



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని అన్నారు. రావని చెప్పడానికి ఇది రేవంత్ రెడ్డి జాగీరు కాదని విమర్శించారు. సుప్రీంకోర్టు మీద తమకు పూర్తి నమ్మకం ఉందని, పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీని బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ మాత్రమే రైతుల సంక్షేమం కోసం పని చేశారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో శాంతిభద్రతలు చాలా చక్కగా ఉండేవని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు మీద ఏడవడం మానివేయాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

# ఎదురైనా ఏలినవారే చూసుకుంటారన్న ధైర్యమేమో!

న్యాయస్థానాలతో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఆటలాడుతున్నారు. పరిధులు గుర్తెరిగి విధినిర్వహణ చేయాలని పదిరోజులనాడు చెప్పినా తమ వెనకటి గుణం మానుకోవటానికి ససేమిరా అంటున్నారు. అందుకే ఏపీ హైకోర్టు మంగళవారం మరోసారి చీవాట్లు పెట్టవలసి వచ్చింది. హైకోర్టు ధర్మాసనం ముందు ప్రస్తావనకొచ్చిన ప్రేమ్‌కుమార్ కేసు విచిత్రమైనది. మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడైన ప్రేమ్‌కుమార్ రహదారుల బాగుకు నిధుల కోసం ఊరూరా టోల్‌గేట్లు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా ఒక చిన్న రూపకాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దానిపై ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. తాము కట్టే పన్నుల్లో రోడ్ సెస్ వంటివి ఉండగా ఇలా ప్రత్యేకించి మళ్లీ వసూలు చేయడమేమిటన్న చర్చ మొదలైంది. అందుకే సర్కారువారికి కంటగింపైంది. ఆయన్ను ముప్పుతిప్పలు పెట్టడమే ధ్యేయంగా తప్పుడు కేసు సృష్టించారు. 'మనోభావాలు' దెబ్బతిన్నాయని ఒక వ్యక్తి ద్వారా ఫిర్యాదు చేయించి కర్నూలునుంచి గుంటూరుకు ఆగమేఘాలమీద వచ్చి అర్ధరాత్రి అరెస్టుకు పూనుకున్నారు. ఇంగితం మరిచి ఆయన భార్య, కుమార్తెలపై దౌర్జన్యం కూడా చేశారు. ఇదొక్కటే కాదు... నిరుడు డిసెంబర్‌నుంచి ఇలాంటి కేసులెన్నో ఉన్నత న్యాయస్థానం దృష్టికి వస్తూనేవున్నాయి. ఆ పిటిషన్లపై విచారించిన న్యాయమూర్తులు హెచ్చరిస్తూనే వున్నారు. కానీ పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బహుశా ఎలాంటి ఇబ్బందులు హైకోర్టుతో చీవాట్లు తిన్న మరునాడే శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో పోలీసుల తీరు ఈ సందేహాన్నే కలిగిస్తోంది. ఎంపీపీ ఎన్నికల్లో విప్ జారీ చేయటానికి అధికారులను కలవడానికెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులపై తెలుగుదేశం నేతలు దౌర్జన్యానికి దిగితే అడ్డుకోవాల్సిన పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ నేతలపైనే తప్పుడు కేసు బనాయించి నిర్బంధంలోకి తీసుకున్నారు. నిద్రపోయేవారిని లేపవచ్చు... నిద్ర నటిస్తున్నవారిని తెలివిలోకి తీసుకురావటం సాధ్యమేనా? వీళ్లంతా కొత్తగా విధి నిర్వహణలో చేరినవారు కాదు. 'జీ హుజూర్' అంటే తప్ప జీతంరాళ్లు రాని వారు కాదు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులద్వారా వచ్చే ఆదాయంతో నెలనెలా జీతభత్యాలు పొందు తున్నవారు. అంచెలంచెలుగా పదోన్నతులు పొందినవారు. కానీ పాలకులు మారేసరికి వీరిలో అపరిచితుడు బయటికొచ్చినట్టుంది. తప్పుడు వాగ్దానాలతో, ప్రత్యర్థులపై దుష్ప్రచారంతో, చడీ చప్పుడూ కాకుండా సాగించిన అక్రమాలతో అందలం ఎక్కిన పాలకులు ఎంతకాలం ఊరేగుతారు? వారిని నమ్ముకుని ఇష్టారాజ్యం చేయొచ్చనుకోవటం, తమకేమీ కాదనుకోవటం మంచిదికాదని అధికారులు గ్రహించాలి. ఈ పాలన కొడిగట్టి కొండెక్కాక తమ పరిస్థితేమిటన్న స్పృహ కలగాలి. అసలు దేశానికి రాజ్యాంగం ఉన్నదని, పౌరులకు దానిద్వారా హక్కులు సమకూరాయని, తమతో సహా అన్ని వ్యవస్థలూ వాటికి అనుగుణంగానే ప్రవర్తించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే న్యాయ స్థానాలు చూస్తూ ఊరుకోవని తెలుసుకోవాలి. ఈ దేశంలో న్యాయస్థానాలు ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో సైతం నిర్భయంగా తీర్పులిచ్చిన ఉదంతాలున్నాయి. ఆ సంగతిని ప్రభుత్వమూ, పోలీసులూ కూడా తెలుసుకోవాలి. విధినిర్వహణ తీరుతెన్నులెలా వుండాలో తెలిపే మాన్యువల్ గురించి ధర్మాసనం పోలీసులకు గుర్తు చేయక తప్పలేదు. సాధారణ స్థాయి కానిస్టేబుల్ మొదలుకొని డీజీపీ వరకూ విధినిర్వహణ ఎలా వుండాలో, బాధ్యతలేమిటో తెలిపే మాన్యువల్ అది. ఎఫ్ఐఆర్‌ల నమోదు, దర్యాప్తు విధి విధా నాలూ, అధికారాల వినియోగంలో పాటించాల్సిన పద్ధతులు, పరిమితులు వగైరాలన్నీ అందులో నిర్దేశించివుంటాయి. పౌరులకుండే హక్కులేమిటో, విధినిర్వహణలో వాటిని పాటించాల్సిన అవసర మేమిటో మాన్యువల్ చెబుతుంది. హైకోర్టు భిన్న సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు గమనిస్తే ఈ మాన్యువల్‌ను పోలీసులు పట్టించుకోవటం మానేశారని అర్థమవుతుంది. కనీసం గుర్తు చేస్తున్నా దున్నపోతు మీద వానపడిన చందాన ప్రవర్తిస్తున్నారు. వర్రా రవీంద్రరెడ్డి, అవుతు శ్రీధర్‌రెడ్డి, పప్పుల వెంకటరమణారెడ్డి, బొసా రమణ వగైరాల అరెస్టుల విషయంలో పదే పదే చెబుతున్నా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే పోలీసుల తీరు చూస్తే మాకు బీపీ పెరిగిపోతున్నదని ధర్మా సనం వ్యాఖ్యానించింది. అవసరాన్నిబట్టి కేసులు కాక, ఏదోవిధంగా కేసులు పెట్టాలి... ఎవరో ఒకర్ని అరెస్టు చేయాలని చూడటం సరికాదని హెచ్చరించింది. తమ ముందు దాఖలైన పత్రాలను పూర్తిగా పరిశీలించకుండానే మేజిస్ట్రేట్‌లు రిమాండ్ విధిస్తు న్నారని కూడా ఈ సందర్భంగా ధర్మాసనం అనటం గమనించదగ్గది. ప్రేమ్‌కుమార్ కేసు సంగతే తీసుకుంటే ఆయన అక్రమార్జనకు పూనుకున్నాడంటూ రూ. 300 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఇంత హాస్యాస్పదంగా పెట్టే కేసుల్ని మేజిస్ట్రేట్‌లే తమ స్థాయిలో అడ్డు కోవచ్చు. అది లేకపోవటంవల్ల ఉన్నత న్యాయస్థానంలో కేసుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా స్థాయిలో న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేయక పోవటంవల్ల బెయిల్ దరఖాస్తులు తమవద్దకు వెల్లువలా వచ్చిపడుతున్నాయని నిరుడు జూలైలో అప్పటి

# ఇదే ఫస్ట్‌టైమ్.. అసెంబ్లీలో హైవోల్టేజ్ కామెంట్స్..

మొదటి పేజి తరువాయి




పాల్పడితే కేటీఆర్ కుటుంబం అంతా జైల్లోనే ఉండేదన్నారు. కక్ష సాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం తమకు లేదని.. దేవుడు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు.

## అసెంబ్లీలో సీఎం ప్రసంగం..

కక్ష సాధింపుల ఆలోచన ప్రభుత్వానికి లేదు. కక్ష సాధింపులకు పాల్పడితే మీరంతా చంచల్‌గూడ జైల్లోనే.. చర్లపల్లి జైల్లోనే ఉండేవారు. సలహాలు ఇస్తారనుకుంటే.. ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారు. అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేస్తే రూ. 500 ఫైన్ వేస్తారు. కానీ, ఎంపీగా ఉన్న తనను చర్లపల్లి జైలుకు పంపారు. జైల్లో నిద్రలేని రాత్రుళ్లు గడిపాను. డిటెన్షన్ సెల్లో 16 రోజులు నన్ను నిర్బంధించారు. రాత్రిపూట లైట్లు ఆపమని అడిగినా.. జైలు సిబ్బంది ఆపేవారు కాదు. ఎందుకని అడిగితే.. పై నుంచి ఆదేశాలు ఉన్నాయనేవారు. రాజకీయ కక్షసాధింపులు చేసింది మీరు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లా. కక్ష సాధింపు మీదా నాదా పైనుంచి దేవుడు అన్నీ చూస్తాడని వేచి చూశా. నేను ప్రమాణస్వీకారం చేసిన రోజే.. వాళ్లు ఆస్పత్రి పాలయ్యారు. నేను కక్ష సాధింపులకు పాల్పడితే మీ కుటుంబం అంతా జైలుపాలే. ఇప్పటివరకు మేం అక్రమ కేసులు పెట్టలేదు.

రైతు రుణమాఫీ చేశాం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారి రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి.. అసలు పూర్తే చేయలేదు. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని రైతుబంధు కూడా వేయలేదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.16,900 కోట్లతో రుణమాఫీ చేశారు. మేం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే.. రూ.20,615 కోట్ల రుణమాఫీ చేశాం. బీఆర్ఎస్ ఎగవేసిన రైతుబంధు రూ.7,625కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని పేద రైతులను బెదిరించారు. కానీ వారి ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించి అమ్ముకున్నారు. మేం వరి వేసిన వారికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చాం.

## కాంగ్రెస్ అంటేనే కరెంట్..

అసలు బీఆర్ఎస్‌కు ఉచిత కరెంట్‌తో ఏం సంబంధం.. రాష్ట్రంలో ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. రైతుల ఉచిత కరెంట్ కోసం రూ.33వేల కోట్లు ఖర్చు చేశాం. బీఆర్ఎస్ పదేళ్లలో చేయని పనులు.. మేం 10 నెలల్లో చేశాం.

భారీగా అప్పులు..

తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర అప్పు రూ.72వేల కోట్లు. కార్పోరేషన్ అప్పులు కూడా కలిపితే రూ.90 వేల కోట్లు. ఈ పదేళ్లలో అప్పులే రూ.3.50లక్షల కోట్లు దాటింది. మేం అధికారంలోకి వచ్చే నాటికి అప్పు రూ.6.69 లక్షల కోట్లు. ఇతర బకాయిలతో కలిపి రూ.7.05 లక్షల కోట్లు. పెండింగ్ బిల్లులే రూ.40వేల కోట్లు పెట్టిపోయారు. మేం 15 నెలల్లో రూ.1.58లక్షల కోట్ల అప్పు చేశాం. కొత్తగా చేసిన అప్పులో రూ.1.53లక్షల కోట్లు పాత అప్పులకే చెల్లించాం. కాళేశ్వరంపై రూ.70,490 కోట్లు అప్పు తీసుకొచ్చారు. కూలిపోయిన ఆ ప్రాజెక్ట్‌కు రూ.5వేల కోట్లకు పైగా చెల్లించాం. గత సీఎం డాక్టర్, ఇంజనీర్, డిజైనర్ నేనే అంటూ కాళేశ్వరం కట్టారు. ఇంజనీర్లు చెప్పినా వినకుండా.. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్ట్ కట్టారు. ఏడో వింత అంటే మూడేళ్లకే పనికిరాకుండా పోయింది. ఇప్పుడు నీళ్లు నిలిపితే కూలుతుందని నిపుణులు చెబుతున్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే.. తెలంగాణలో వరి దిగుబడి పెరిగింది.

# నేడు పోలవరంలో చంద్రబాబు పర్యటన

మొదటి పేజి తరువాయి




సీఎం 2014లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా నిర్వాసితుల గురించి ఆలోచించడం కానీ, పట్టించుకోవడం కానీ చేయలేదని విమర్శించారు. కనీసం వారి సమస్యల పట్ల ఆలోచించిన దాఖలాలు కూడా లేవన్నారు. పోలవరం పూర్తవ్వాలంటే తెలంగాణలోని 7 ముంపు మండలాలు ఏపీలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధాని మోదీని ఒప్పించినట్లు తెలిపారు. వీలైనంత వరకు నిర్వాసితులకు న్యాయం చేసి ఆదుకోవాలని ముందుకెళ్లామన్నారు. రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని మండిపడ్డారు. ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలి తప్ప దుర్వినియోగం చేయకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు.

గత పాలకులు పోలవరం నిధులు మళ్లించారు...

తాను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశానని, 33 సార్లు ప్రాజెక్టును సందర్శించానని ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే నిర్వాసితులు ఈ పాటికే స్థిరపడేవారని తెలిపారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ. 2,500 కోట్ల ఆదాయం వచ్చేదన్నారు. దాన్ని కూడా ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు కూడా పెరిగిపోయిందని తెలిపారు.

## మా ప్రభుత్వంలో మాయమాటలు చెప్పేవారు లేరు...

పునరావాసం కల్పించిన తర్వాత నిర్వాసితుల ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. నిర్వాసితులు ధైర్యంగా ఉండాలని, ఇది మీ ప్రభుత్వం... మనందరి ప్రభుత్వమన్నారు. మంచిని మంచిగా చెబితే మరింత మంచి జరుగుతుందని తెలిపారు. మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో దళారులు, దొంగలు, మోసగాళ్లు, మాయ మాటలు చెప్పేవారు అస్సలు లేరని తెలిపారు. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారని, ఇళ్లు నిర్మించుకునే

# కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటన

మొదటి పేజి తరువాయి



అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ నిలిచేది. పోలవరం పూర్తయ్యేది. రాష్ట్రాన్ని చంద్రబాబు నిలబెడతారు. రాష్ట్రమంతటా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు సహా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ నీటి సమస్య తీర్చేందుకు వీలైనంత త్వరగా హంద్రీనీవా పూర్తిచేసి అందరికీ నీరు అందిస్తారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందో ప్రజలు,పారిశ్రామివేత్తలకు తెలుసు.

## డ్వాక్రాతో మహిళల జీవితాల్లో వెలుగులు

ఇక్కడికి వచ్చిన మహిళలందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు. మహిళలు ఒకసారి చెబితే చాలు చక్కగా వింటారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్నారు. మహిళల కోసం సీఎం చంద్రబాబు అనేక పథకాలు అమలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో మగవారిని మించి విజయాలు సాధించాలని చంద్రబాబు కోరుకుంటూ ఉంటారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించారు. ఒకప్పుడు వందా , రెండు వందల కోసం ఇతరులపై ఆధారపడిన స్త్రీలు నేడు బ్యాంకు లావాదేవీలు స్వయంగా చూసుకునే స్థాయికి చేరారంటే అది చంద్రబాబు తీసుకొచ్చిన డ్వాక్రాతోనే సాధ్యమైంది. మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే మహిళలు ఇంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువులు చూసుకుంటున్నారు. వ్యాపారంలోకి రాకముందు నేను ఇంటి నుంచి బయటకు రావాలంటేనే సిగ్గుపడేదాన్ని. నేను ఏమైనా చేయగలను అనే ధైర్యం బిజినెస్ లోకి అడుగుపెట్టాకే వచ్చింది. మీ గౌరవం కోసం మీరు పనిచేయండి. మహిళలు తమ సంపాదనను ముందుగా వారి అవసరాలకు వినియోగించుకోవాలి" అని నారా భువనేశ్వరి అన్నారు.

# మన ప్రభుత్వం వచ్చింది - పోలవరం పూర్తి చేసుకుందాం: సీఎం

మొదటి పేజి తరువాయి



సీఎం జగన్ పట్టించుకోలేదన్నారు. ఎప్పుడో పూర్తి కావాల్సిన ప్రాజెక్టును జగన్ పక్కన్నపెట్టారని విమర్శించారు. 2019లోనూ టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే పోలవరం ఎప్పుడో పూర్తయ్యేదన్న ఆయన, ఆలస్యం కావడంతో పోలవరం ఖర్చు భారీగా పెరిగిపోయిందన్నారు. తాను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పని చేశానని, ఐదేళ్లలో 33 సార్లు పోలవరాన్ని సందర్శించానన్నారు. వీలైనంత త్వరగా పరిహారం ఇచ్చే ప్రయత్నం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారని, పేర్ల తొలగింపుపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 2027 నాటికి పునరావాసాలు పూర్తి చేస్తామని వెల్లడించారు. పునరావాసాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తామన్నారు. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చేస్తామన్నారు. పోలవరంలో నీళ్లు వదిలే ముందే పునరావసం పూర్తి చేస్తామన్నారు. మన ఎన్డీయే ప్రభుత్వం వచ్చిందని, సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేసుకుందామని అన్నారు. 829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాల్లోకి వేసిన కూటమి ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. నిర్వాసితుల ఆదాయం, జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళిక రూపకల్పన చేశామన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడిగా సీఎం పేర్కొన్నారు. మీకు న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. ఎక్కడా ఒక్క పైసా అవినీతి లేకుండా, నేరుగా నిర్వాసితుల ఖాతాల్లోకే ప్యాకేజీ డబ్బులు వస్తాయన్నారు. దళారులు లేరు, మధ్యవర్తులు లేరని స్పష్టం చేశారు. తాను వచ్చాక మైదాన ప్రాంతాల వారితో పోలిస్తే గిరిజనులకు ఆదాయం పెరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణంలోనూ 75 వేలు గిరిజనులకు అదనంగా ఇస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వమని, బాధితులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు.

మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

## పుస్తకాలు ఆన్‌లైన్‌లో అమ్మడమే మంచిది

'కథా ప్రపంచం' కిరణ్

తిరుపతిలో ఓ సాహిత్య జీవి ఒంటి చేత్తో అరుదైన పుస్తకాలను ప్రచురించి సాహిత్య ప్రపంచానికి అందిస్తూ ఉన్నాడు. బాల సాహిత్యం, తెలుగు కథలు, నవలలు, ఇతర భాషలు, ఇతర దేశాలకు చెందిన రచనల తెలుగు అనువాదాలు ప్రచురిస్తున్నాడు. ఆయన పేరు కిరణ్. కథాప్రపంచం కిరణ్‌గా, తిరుపతి కిరణ్‌గా సుపరిచితుడు. ఆయనతో సంభాషణ.. మాది తిరుపతి. నాన్న టీటీడీ ఉద్యోగం చేసేవారు. నేను హైదరాబాదులో బీకాం చదువుకున్నాను. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో మీడియా రంగంలో పని చేశాను. కొంత భక్తి ఉన్నా, సాహిత్యమంటే ప్రాణం. ఇందువల్ల సాహిత్య రంగం లోనే పూర్తి కాలం పని చేయాలని నిర్ణయించుకున్నాను. పుస్తకాలను చదవడం, మనసుకు నచ్చిన పుస్తకాలను ప్రచురించడం ఒక వ్యాపకంగా పెట్టుకున్నాను. పాఠకుల నుంచీ మంచి ఆదరణ లభిస్తుండటంతో సాహిత్య ప్రచురణ రంగంలోనే కొనసాగుతున్నాను.

తిరుపతి కపిలతీర్థం రోడ్డులో నవభారతి స్కూల్లో ఐదవ తరగతి వరకూ చదువుకున్నాను. ఆ స్కూల్ నిర్వా హకుడు ఏనుగుల రామస్వామి నాయుడు స్కూల్‌లో సాహిత్య వాతావరణాన్ని ఏర్పరిచారు. చందమామ, బాల జ్యోతి, బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు పత్రికలు తెప్పించేవారు. అక్కడికి వచ్చే హిందూ పత్రికలోని యంగ్ వరల్డ్ చాలా ఆసక్తిగా ఉండేది. మొదట పుస్తకాల్లో బొమ్మలంటే ఇష్టం ఉండేది. హైదరాబాద్ చేరాకా అబిడ్స్ పాత పుస్తకాలే నా ప్రపంచం. అఫల్‌గంజ్ లైబరీలో చాలా చదువుకున్నాను. తెలియకుండానే సాహిత్యం పట్ల ఆసక్తి కల్గింది.

మీ 'కథా ప్రపంచం' ప్రచురణల గురించి చెప్పండి?

2013 లో కథా ప్రపంచం పేరున ఫేస్‌బుక్ పేజ్, ఆ తర్వాత బ్లాగ్, వెబ్‌సైట్ మొదలుపెట్టి నిర్వహించాను. సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వేలాదిమంది స్పందించేవారు. వారు కోరిన పుస్తకాలు, రచయితల వివరాలు సైతం అందించేవాడిని. ఇలా ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్‌కె నారాయణ్, కెఏ అబ్బాస్ వంటి రచయితల గురించి తెలుసుకున్నాను. ఇలాంటి గొప్ప రచయితల గురించి నేనే పుస్తకాలను ఎందుకు తీసుకురాకూడదనే ఆలోచన కలిగింది. ప్రచురించటంమొదలుపెట్టాను. ఇప్పటిదాకా యాభై పుస్తకాలు తెచ్చాను. గోపిని కరుణాకర్ 'మా తిరుపతి కొండ కథలు' మొదట ప్రచురించాను. ఆ తర్వాత ఎస్వీ రంగారావు కథలు, మధురాంతకం రాజారాం బాలల కథలు, ముళ్ళపూడి శ్రీదేవి 'రమణీయ శ్రీ రామాయణం', ప్రేమ్‌చంద్ కథావళి, కమలాదాస్ 'కుక్కలు' మొదలైన పుస్తకాలు ప్రచురించాను. నేను ప్రచురించిన యాభై పుస్తకాల్లో సగం బాల సాహిత్యమే. పిల్లల కోసం బేతాళ కథలు ఏడు భాగాలు, చందమామ బాలల కథా సాహిత్యం ఐదు భాగాలు, పిల్లల పిట్ట కథలు ఐదు భాగాలు ప్రచురించాను. పరోపకారి పాపన్న కథలు, దుర్గేశ నందిని, గుండు భీమన్న కథలు వంటి పుస్తకాలను పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రచురించాను. మొదట్లో పుస్తక విక్రేతలకు పుస్తకాలు ఇచ్చి ఇబ్బంది పడ్డాను. ఆన్‌లైన్‌లో పుస్తకాలు అమ్ముకోవడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చాను. ఇప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ద్వారా పుస్తకాలు అందిస్తున్నాను. బుక్ ఫెయిర్లలో 'కథా ప్రపంచం' ప్రచురణలు అందుబాటులో పెడుతున్నాను. వేల కాపీలు వెయ్యకుండా పబ్లిష్ ఆన్ డిమాండ్ (పీఓడీ) పద్ధతిలో 200 పుస్తకాలు అచ్చు వేసి, ఆ తర్వాత డిమాండును బట్టి పుస్తకాలు పునర్ముద్రణ చేస్తున్నాను. కొత్త తరంలో పుస్తక పఠనం పెంచాలన్నదే లక్ష్యం. త్వరలో భాషా నైపుణ్యం ఉన్న అనువాదకులను గుర్తించడం పెద్ద సమస్య. మూల భాషలోనూ, లక్ష్య భాషలోనే కాదు, ఇరు ప్రాంతాల సామాజిక స్థితిగతుల గురించి అనువాదకులకు అవగాహన ఉండేలా చూసుకోవాలి. మూల రచయితకు సంబంధించిన కాపీరైట్స్, అగ్రిమెంట్స్, రచన ప్రతి తీసుకోవాలి. అయితే, గొప్ప రచయితల సాహిత్యాన్ని ఈ తరానికి అందించేలనే బలమైన ఆకాంక్ష ముందు ఈ సమస్యలన్నీ చిన్నవే.

ప్రత్యేకించి బాల సాహిత్య రంగంలో కృషి చేయాలని ఉంది. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో నిర్వహించే వరల్డ్ బుక్ ఫెయిర్‌లో తెలుగు పుస్తకాలను ప్రదర్శించాలని ఉంది. చాసో కథల్ని కన్నడలోకి తేవాలని అనుకుంటున్నాను. ఒడిశా రచయిత ఫకీర్ మోహన్ సేనాధిపతి రచనలను తెలుగులోకి తేవాలని అనుకుంటున్నాను. మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేసుకొని దేశంలోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో పుస్తకం విశిష్టతను తెలియ చేయాలనే ఆశ ఉంది. కథా ప్రపంచం ద్వారా అన్ని భారతీయ భాషల్లోనూ ముఖ్యమైన పుస్తకాలను గుర్తించి ప్రచురించాలని, తెలుగులో నచ్చిన రచనలను ఇతర భాషల్లోకి అనువదించి పుస్తక రూపంలో తీసుకురావాలని ఉంది.

# తాగే నీరూ విషమై...



పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లు తాగునీటి సరఫరా లేక సామాన్య జన జీవితాలు ఇప్పటికే అగచాట్ల పాలవుతున్నాయి. ఉన్న కొద్ది నీటి వనరులూ గృహ, పారిశ్రామిక వ్యర్థాల వెల్లువతో తీవ్రంగా కలుషితమవుతున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లు తాగునీటి సరఫరా లేక సామాన్య జన జీవితాలు ఇప్పటికే అగచాట్ల పాలవుతున్నాయి. ఉన్న కొద్ది నీటి వనరులూ గృహ, పారిశ్రామిక వ్యర్థాల వెల్లువతో తీవ్రంగా కలుషితమవుతున్నాయి. దాంతో దెబ్బతింటున్న ప్రజారోగ్యం- అంతిమంగా ఆర్థిక ప్రగతికి శాపమవుతోంది. దేశీయంగా పట్టణ ప్రాంతాల్లో నిత్యం ఏడు వేల కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు పుట్టుకొస్తోంది. అందులో దాదాపు మూడొంతులు శుద్ధి కాకుండానే నదులు, చెరువులు, ఇతర జలవనరుల్లోకి చేరుతోంది. మురుగు నీటి శుద్ధిలో అలసత్వం మూలంగా బ్రెజిల్, కెన్యా వంటి వాటితో పోలిస్తే ఇండియాకే ఎక్కువ నష్టం దాపురిస్తోందనే చేదు వాస్తవాన్ని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. తాగునీటి కాలుష్యం వల్ల డయేరియా విజృంభించడంతో భారతావని ఏడాదికి రెండు వేల కోట్ల రూపాయలు కోల్పోతోందని అంచనా. మత్స్యసంపద వృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్న కలుషిత జలాలు దేశార్థికానికి ఏటా రూ.17 వేల కోట్లకు పైగా నష్టం చేస్తున్నట్లు పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇటీవల మహారాష్ట్రలో జీబీ సిండ్రోమ్ ఉద్ధృతికి నీటి కాలుష్యం ఒక కారణమని తేలింది. కలుషిత జలాల కారణంగా సంభవిస్తున్న ఇలాంటి విపత్తుల తీవ్రత నానాటికీ పెరిగిపోతుండటమే ఆందోళనకరం. మురుగునీరు, ఇతర కాలుష్యకారకాల కారణంగా దేశీయంగా 323 నదుల నీటి నాణ్యత దెబ్బతిన్నట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం పెచ్చుమీరడం జలవనరులను పాడుచేస్తోంది. ప్రమాదకర పారిశ్రామిక వ్యర్థాలను నేరుగా నదులు, చెరువుల్లోకి వదిలేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. మానవ మృతదేహాలు, పశు కళేబరాలు అలాగే వాటిలోకి వచ్చి చేరుతున్నాయి. ఇక పట్టణాల మురుగు సరేసరి. దానికితోడు ఎక్కడికక్కడ గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తవల్లా స్థానిక జల వనరులు విషతుల్యం అవుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటినే తాగుతున్న ఎంతోమంది ప్రాణాలు కడతేరిపోతున్నాయి. మరెందరో ఆస్పత్రిపాలై ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒక్క డయేరియా వల్లే ఇండియాలో ఏటా 15 లక్షల మంది పిల్లలు చనిపోతున్నట్లు గతంలో వెలుగు చూసింది. కాలుష్య కారకాలతో నిండిన నీటితో పండుతున్న కూరగాయల ద్వారా మన శరీరాల్లోకి చేరుతున్న భారలోహాలు క్యాన్సర్లకు కారణమవుతున్నాయి. ఇంతటి అనర్థాలకు దారితీస్తున్న జలకాలుష్యాన్ని నివారించేందుకు ప్రభుత్వాలు తక్షణం కంకణబద్ధం కావాలి. సింగపూర్, డెన్మార్క్, చిలీ, స్వీడన్ వంటివి జలవనరులను కంటికి రెప్పలా కాచుకుంటూ తమ పౌరులకు పరిశుభ్రమైన నీటిని అందిస్తున్నాయి. మురుగు శుద్ధిలో స్విట్జర్లాండ్, సింగపూర్‌లు మేలిమి విధానాలను పాటిస్తున్నాయి. వీలుని బట్టి వాటిని మనదగ్గరా అమలు చేయాలి. వ్యర్థజలాలను శుద్ధిచేసి పారిశ్రామిక, సాగు అవసరాలకు వినియోగిస్తే నీటి ఎద్దడిని కొద్దిమేర తగ్గించవచ్చు. అందుకోసం మురుగు శుద్ధి కేంద్రా(ఎస్‌టీపీ)లను తగినన్ని నెలకొల్పాలి. అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన ఎస్‌టీపీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి. నదులు, చెరువులను చెత్తబుట్టలుగా భావించే కర్మాగారాలపై కఠిన చర్యలు తీసుకోవడమూ తప్పనిసరి. దేశార్థికానికి జీవగర్ర వంటి గంగానదిని స్వచ్ఛంగా మార్చేందుకు 'నమామి గంగే'కి శ్రీకారం చుట్టారు ప్రధాని మోదీ. ఆ కార్యక్రమం స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు సైతం తమ పరిధిలోని నీటి వనరుల పరిరక్షణకు నడుంకట్టాలి. గంగా బాగుసేత వంటి భారీ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపట్టినప్పుడు- స్థానిక చెరువులు, కుంటలు, నదులకు జీవకళ తేవడం రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు అసాధ్యమేమీ కాదు!

# ఆరోగ్యానికే కాదు... ఆర్థికానికీ సత్తువ!



'వికసిత భారత్' స్వప్నసాకారం బలమైన ఆర్థిక ప్రగతితోపాటు ఆహార, పౌష్టిక భద్రతను సాధించడంతో ముడివడి ఉంది. ఇందులో దేశీయ పౌల్ట్రీ పరిశ్రమకు గణనీయ భాగస్వామ్యం ఉన్నా, తగిన గుర్తింపు లభించడం లేదు. 'వికసిత భారత్' స్వప్నసాకారం బలమైన ఆర్థిక ప్రగతితోపాటు ఆహార, పౌష్టిక భద్రతను సాధించడంతో ముడివడి ఉంది. ఇందులో దేశీయ పౌల్ట్రీ పరిశ్రమకు గణనీయ భాగస్వామ్యం ఉన్నా, తగిన గుర్తింపు లభించడం లేదు. ఈ పరిశ్రమ ప్రజలకు ప్రొటీన్ ఆహారాన్ని అందించడమే కాకుండా, లక్షలాది రైతులకు ఆర్థిక సుస్థిరత కల్పిస్తోంది. దేశ జనాభాతో పాటే ప్రజల ఆదాయమూ గత 15 ఏళ్లుగా పెరుగుతూ వచ్చింది. కోడిమాంసం, కోడిగుడ్ల వినియోగమూ పెరిగి డిమాండ్ ఇనుమడించింది. రానున్న దశాబ్ద కాలంలో దేశ జనాభా 150 కోట్లు దాటి, 2047నాటికి 160 కోట్లకు చేరనుందని అంచనా. పౌల్ట్రీ రంగ ప్రస్తుత పరిస్థితి ఆశాజనకంగా ఉంది. భారత్ ఏటా 35 కోట్ల లేయర్ కోళ్లను ఉత్పత్తి చేస్తోంది. దేశంలో వారానికి 1.1 కోట్ల బ్రాయిలర్లు, 12వేల కోట్ల కోడిగుడ్లతో పాటు 4.5 కోట్ల టన్నుల కోడి మాంసం ఉత్పత్తి అవుతోంది. 2047 నాటికి లేయర్ కోళ్ల సంఖ్య 130 కోట్లకు, బ్రాయిలర్‌ల సంఖ్య 65 కోట్లకు చేరతాయని అంచనా. ఈ ప్రగతి దేశంలో ఉత్పత్తి అయ్యే కోడిగుడ్ల సంఖ్యను దాదాపు 61వేల కోట్లకు చేర్చే అవకాశముంది. ఆ మేరకు దాణా ఉత్పత్తిలోనూ పురోగతి సాధించాల్సి ఉంది. దాణా డిమాండ్ ప్రస్తుతమున్న అయిదు కోట్ల టన్నుల నుంచి 2035 నాటికి 11.5కోట్ల టన్నులకు, 2047 నాటికి 18కోట్ల టన్నులకు పెరగవచ్చు.

### దాణా ఉత్పత్తి కీలకం

ప్రస్తుతం కోళ్ల దాణా ఉత్పత్తిలో మొక్కజొన్న, వరి, ఆవాలు, సోయాబీన్‌తో తయారయ్యే అధిక ప్రొటీన్ కలిగిన డీఆయిల్డ్ కేక్‌ను వాడుతున్నారు. దేశంలో మూడు కోట్ల టన్నుల మేర మొక్కజొన్న ఉత్పత్తి అవుతున్నా, దాంట్లో అధిక భాగాన్ని ఇథనాల్ ఉత్పత్తికే తరలిస్తున్నారు. 2047 నాటికి ఇథనాల్ పరిశ్రమ నుంచి మొక్కజొన్నకు భారీగా డిమాండ్ పెరగనుంది. ఆ మేరకు ధరలు కూడా ఎగబాకవచ్చు. మొక్కజొన్న ధరల్లో ఏమాత్రం పెరుగుదల కనిపించినా, అది కోడిమాంసం, కోడిగుడ్ల ఉత్పత్తి ధరలను అమాంతం పెంచేస్తుంది. అవి సామాన్యులు భరించలేని స్థాయిలో ఉంటే, పౌల్ట్రీ పరిశ్రమకు ఇబ్బందులు ఎదురవుతాయి. దేశంలో దాణా ఉత్పత్తి నిర్వహణకు దీర్ఘకాలిక వ్యూహం అవసరం. దాణా కొరత, ధరల్లో పెరుగుదల కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయి. డీఆయిల్డ్ కేక్‌ను దిగుమతి చేసుకోవడం వంటి తాత్కాలిక పరిష్కారాలు సత్ఫలితాలు ఇవ్వవు. దేశీయంగా మొక్కజొన్న, సోయాబీన్, ఆవాల ఉత్పత్తిని పెంచడమే ఈ సమస్యకు మన్నికైన పరిష్కారం. సాగుభూమిని పెద్దగా పెంచలేం కాబట్టి, అధిక దిగుబడులను సాధించడంపైనే ప్రధానంగా దృష్టి సారించాలి. మన దగ్గర మొక్కజొన్న దిగుబడి హెక్టారుకు 3-4 టన్నులే. అదే అమెరికాలోనైతే 10-12 టన్నులు, చైనాలో 6-7 టన్నుల మేర ఉంటోంది. 2047 నాటికి 12 కోట్ల టన్నుల దిగుబడి సాధించాలంటే భారత్ తన మొక్కజొన్న ఉత్పాదకతను మూడింతలు పెంచాలి. ఇందుకు ఏటా 4.8శాతం కాంపౌండెడ్ వృద్ధి(సీఏజీఆర్) సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇది 3.2 శాతంగానే ఉంది. దేశంలో సోయాబీన్ ఉత్పత్తి కూడా బ్రెజిల్, అమెరికా వంటి దేశాలకన్నా చాలా వెనకబడిపోయింది. ఆయా దేశాల్లో హెక్టారుకు నాలుగు టన్నుల దిగుబడి లభిస్తుంటే, భారత్‌లో అది 1.2 నుంచి 1.5 టన్నుల మధ్యే ఉంటోంది. ఈ దిగుబడులను పెంచుకోవడం దేశంలో వంట నూనెల అవసరాలను తీర్చడానికి, కోళ్లదాణా పరిశ్రమకు ప్రాణప్రదమైనది.

### ధరల నియంత్రణకు మార్గం

దాణా సమస్యను సమర్థంగా ఎదుర్కోవాలంటే, వ్యవసాయంలో కొత్తరీతుల్ని అందిపుచ్చుకోవాల్సిందే. ప్రధానంగా అధిక దిగుబడులను ఇచ్చే మొక్కజొన్న, సోయాబీన్ వంగడాలను రూపొందించే బ్రీడింగ్, బయోటెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెరగాలి. ప్రపంచవ్యాప్తంగా జన్యుమార్పిడి రకాలు అధిక దిగుబడులు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. భూసారాన్నీ, ఉత్పాదకతనూ పెంపొందించడమే కాకుండా... సమర్థ సాగునీటి నిర్వహణ, కర్బన ఉద్గారాల కట్టడి వంటి చర్యల ద్వారా ఉత్పాదకతను పెంచుకోవాలి. పౌల్ట్రీ పరిశ్రమకు నిరంతరంగా ముడి పదార్థాలను సరఫరాచేసే వ్యవస్థ అవసరం. మెరుగైన మౌలిక సదుపాయాలు, శీతల గిడ్డంగులనూ సమకూర్చుకోవాలి. ఇవన్నీ ధరల నియంత్రణకు దోహదపడతాయి. క్రిముల ప్రొటీన్, ఆల్గే, వ్యవసాయ ఉపఉత్పత్తులు వంటి ప్రత్యామ్నాయ దాణా ముడిసరకులు సంప్రదాయంగా ఉపయోగించే ధాన్యాల అవసరాన్ని చాలామటుకు తగ్గిస్తాయి. విభిన్నమైన దాణా ముడిసరకుల వాడకం వల్ల మొక్కజొన్న, సోయాబీన్‌లపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

### భిన్న రంగాల సమన్వయంతో...

కోళ్లదాణాలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి భిన్న రంగాల సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి ఊతమందించాలి. వ్యవసాయ పరిశోధనలపై పెట్టుబడులు పెంచాలి. మొక్కజొన్న, సోయాబీన్, ఆవాల జన్యుమార్పిడి వంగడాల ప్రోత్సాహానికి తగిన వాతావరణం కల్పించాలి. ప్రైవేట్ రంగంలోని వ్యవసాయ వాణిజ్యవేత్తలు, పౌల్ట్రీ ఉత్పత్తిదారులు సైతం నవీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టుబడులు సమకూర్చి... దాణా ముడిసరకుల ఉత్పత్తి, సరఫరాను బలోపేతం చేయాలి. ముడి సరకులకు సంబంధించిన సమస్యలను అధిగమించడానికి విదేశాల నుంచి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవాలి. వికసిత భారత్ దిశగా సాగే పయనం భారత పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధితో పెనవేసుకుని ఉంది. వందేళ్ల స్వతంత్ర భారతం ఆరోగ్యకరమైన కోడి మాంసాన్ని భారీగా ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని సాధించడానికి ఇప్పటి నుంచే మరింతగా కృషి చేయాలి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, సమగ్ర పద్ధతుల్ని అనుసరించడం అనివార్యం. పౌల్ట్రీ పరిశ్రమ కేవలం ఒక ఆహార వనరు మాత్రమే కాదు. దేశ ఆహార భద్రతకూ, ఆర్థికాభివృద్ధికీ అది మూలస్తంభం వంటిది

# మంచు కరిగి ముంచుకొస్తున్న ముప్పు



భూతాపం పెరుగుదల కారణంగా అనేక అనర్థాలు వాటిల్లుతున్నాయి. పలు దేశాల్లో కుండపోత వానలు, వరదలు, కరవు తరహా పరిస్థితులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో మంచు వేగంగా కరిగిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భూతాపం పెరుగుదల కారణంగా అనేక అనర్థాలు వాటిల్లుతున్నాయి. పలు దేశాల్లో కుండపోత వానలు, వరదలు, కరవు తరహా పరిస్థితులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో మంచు వేగంగా కరిగిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భూతాపాన్ని కట్టడి చేయకపోతే, అక్కడి హిమనదాలు 2100 నాటికి 75శాతం మేర మంచును కోల్పోయే ప్రమాదముంది. భూమి మీద ఆర్కిటిక్, అంటార్కిటిక్‌ల తరవాత అత్యధిక మంచు దక్షిణ, మధ్యాసియాల్లోని పర్వత శ్రేణుల్లో, టిబెట్ పీఠభూమిలో పోగుపడి ఉంది. అందుకే ఈ ప్రాంతాన్ని మూడో ధ్రువమని పిలుస్తారు. దీని పరిధిలోకి వచ్చే హిందూకుష్-హిమాలయాలు అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, భారత్, బంగ్లాదేశ్, చైనా, భూటాన్, నేపాల్, మయన్మార్‌లలో 3,500 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉన్నాయి. అయితే, హిమాలయాల్లో అత్యున్నత శిఖరమైన ఎవరెస్ట్ మీద నేడు మంచు తరిగిపోతోంది. ప్రధానంగా అత్యంత ఎత్తున ఉన్న దక్షిణ కోల్ హిమనదం గణనీయంగా మంచును కోల్పోతోంది. అక్కడ 1990 దశకానికి ముందున్న మంచులో ఇప్పుడు సగమే మిగిలిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. హిమాలయాల పడమటి భాగమైన హిందూకుష్ పర్వత శ్రేణిలో ఉష్ణోగ్రత ప్రపంచ సగటుకన్నా మూడింతలు వేగంగా పెరిగిపోతోంది.

### ప్రమాదంలో జనజీవితాలు

భారతదేశంలోని హిమనదాల్లో మంచు కరిగి నీరవ్వడమే కాదు, కట్టలు తెంచుకుని మరీ తరచూ ఆకస్మిక వరదలు తెచ్చిపెడుతోంది. 2013లో కేదార్‌నాథ్‌లో అటువంటి ఉత్పాతమే సంభవించింది. 2021లో ఉత్తరాఖండ్‌లో హిమనద విస్ఫోటనం వల్ల రెండు జలవిద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. లద్దాఖ్, సిక్కింలలోనూ హిమనద విచ్ఛేదాలు జరిగాయి. 2021లో నేపాల్‌లో భారీ వర్షాలకు తోడు పర్వతాలపై మంచు భారీగా కరిగివచ్చి మేలమ్చి నదిలో ఉద్ధృత వరదలకు కారణమైంది. దాంతో వేలాది ఎకరాల్లో పంటలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. బాధితులకు కొన్నాళ్లపాటు తాగునీటికి తీవ్ర ఇక్కట్లు తప్పలేదు. హిమాలయాలు, టిబెట్ పీఠభూమిలోని మంచు అనేక జీవనదులకు మూలాధారం. ఆ నదుల పరీవాహక ప్రాంతాల్లో వంద కోట్ల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. భూతాపం వల్ల హిమనదాల్లోని మంచు పెద్దయెత్తున కరిగిపోతుండటం వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే, అక్కడి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లాల్సిన అగత్యం ఏర్పడుతుంది. వ్యవసాయం, వ్యాపారాలు దెబ్బతిని ఆహార ధరలు పెరిగిపోతాయి. ప్రపంచంలో బియ్యం ఉత్పత్తిలో మూడో వంతు, గోధుమ ఉత్పత్తిలో నాలుగో వంతు హిందూకుష్-హిమాలయ ప్రాంతంలోనే జరుగుతోంది. అక్కడి హిమనదాలు 2050కల్లా కుంచించుకుపోయి తాగు, సాగునీటికి కొరత ఏర్పడనుంది. అందుకనే, ఆ ప్రాంతంలో వాతావరణ మార్పులను తట్టుకుని పెరిగే పంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహించడానికి ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) రంగంలోకి దిగింది. మధ్యాసియా, పశ్చిమాసియాల్లో ఈ తరహా పంటల సాగు కోసం 350కోట్ల డాలర్లు సమీకరించాలని లక్షిస్తోంది. 'హిమనదాల నుంచి పొలాలకు' పేరున రూపొందించిన ఈ కార్యక్రమంలో ఏడీబీతోపాటు ఐరాస హరిత వాతావరణ నిధి, స్థానిక ప్రభుత్వాలు భాగస్వాములవుతాయి. హిందూకుష్-హిమాలయాలతో పాటు భూటాన్, నేపాల్ దేశాల్లో వాతావరణ వైపరీత్యాలను తట్టుకునేలా రహదారులు, విద్యుత్కేంద్రాలు తదితర మౌలిక వసతుల నిర్మాణానికీ ఏడీబీ సాయం అందిస్తోంది.

### పరిరక్షణ సంవత్సరమిది...

భూగోళంలోని నీటి వనరుల్లో రెండు శాతం హిమనదాల్లోనే నిక్షిప్తమై ఉంది. ప్రపంచ ప్రజలకు 70శాతం తాగునీరు హిమనదాలు, పర్వతాలపై మంచు ఆచ్ఛాదన నుంచే లభిస్తోంది. భూగోళంపై సుమారు 2.75లక్షల హిమనదాలు ఉన్నాయి. 1976-2023 మధ్యకాలంలో 2.10లక్షల హిమనదాలను పరిశీలించగా- అవి 2023లోనే అత్యధికంగా మంచును కోల్పోయినట్లు తేలింది. స్విట్జర్లాండ్ హిమనదాలు 2022-23లో పది శాతం కుంచించుకుపోయాయి. వివిధ దేశాల్లోని పెద్ద హిమనదాలు 2030కల్లా కుదించుకుపోతాయనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో యునెస్కో, ప్రపంచ వాతావరణ సంస్థలు 2025ని అంతర్జాతీయ హిమనద పరిరక్షణ సంవత్సరంగా ప్రకటించాయి. వాతావరణ వ్యవస్థలో హిమనదాల పాత్ర, నీటి లభ్యతపై ప్రజలందరికీ అవగాహన పెంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఐరాస మార్చి 21వ తేదీని ప్రపంచ హిమనద పరిరక్షణ దినోత్సవంగా పాటించాలంటోంది. మరుసటి రోజు ప్రపంచ జలదినోత్సవం. ఈ ఏడాది రెండు దినోత్సవాలను వెనువెంటనే పాటించడం ద్వారా నీటికీ, హిమనదాలకూ మధ్యనున్న అవినాభావ సంబంధాన్ని ప్రపంచానికి గుర్తుచేయాలని ఐరాస సంకల్పించింది. విధానకర్తలు, పరిశోధకులు, కార్పొరేట్ సంస్థలు, ప్రజలను హిమనద పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములను చేయడానికి ఏడాదంతా వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. పారిస్ వాతావరణ సదస్సు తీర్మానించిన ప్రకారం, భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ దగ్గర పరిమితం చేయాల్సిన అవసరాన్ని ప్రపంచ దేశాలకు ఐరాస గుర్తుచేస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో తజికిస్థాన్‌లో అంతర్జాతీయ హిమనద సంరక్షణ మహాసభను నిర్వహించనుండటం విశేషం.

## సర్పంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




ఆలూరు మార్చి 27:ఆలూరు పట్టణం నందు వేసవి తాపా న్ని దృష్టిలో పెట్టుకొని ఆలూరు ప్రజల శ్రేయస్సుకై మరియు ఇతర గ్రామాల నుండి ఆలూరుకు వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకొని మండే ఎండల తాపాన్ని తగ్గించుట కొరకు ఆలూరు లోని చెక్ పోస్ట్ దగ్గర ఆలూరు సర్పంచ్ ఎన్ అరుణాదేవి మరియు జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది. పట్టణ ప్రజలు, ప్రయాణికులు అభినందనలు తెలియజేశారు.

## తుగ్గలి ఎంపీపీ గా రాచపాటి రామంజనమ్మ

### ఉపఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీసీ లు



మార్చి 27: తుగ్గలి :- తుగ్గలి మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా రాచపాటి రామంజినమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హెచ్ఎన్ఎస్ ప్రాజెక్ట్ భూసేకరణ అధికారి, ఎన్నికల ప్రత్యేక అధికారి అజయ్ కుమార్ ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించాడు. మండలానికి చెందిన ఎంపిటిసిలు రాజు (తుగ్గలి), పద్మావతి( గిరిగెట్ల), భారతమ్మ (ఎర్రగుడి), ఆవుల ఆదిలక్ష్మి (కడమకుంట్ల), హరిజన రాశులమ్మ (ముక్కెళ్ల ), రాచపాటి రామంజినమ్మ (శభాష్ పురం), వనమాల పుష్పావతి (రాంపురం ), బోయ శ్రీదేవి (రాతన), పెద్ద రంగన్న (పెండేకల్లు), పుట్లూరు లలితమ్మ (చెన్నంపల్లి ), జల్లా సుంకన్న (బొందిమడుగుల), కామిరెడ్డి లక్ష్మీదేవి (రాంపల్లి), ఎర్ర నాగప్ప (జొన్నగిరి-1), ప్రతాప్ రెడ్డి (జొన్నగిరి -2), మల్లికార్జున రెడ్డి (ఎద్దుల దొడ్డి), రాందాస్ నాయక్ (ఉప్పర్లపల్లి), మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్ భాషా లు ఎన్నికలలో పాల్గొన్నారు. ఎంపీపీ అధ్యక్ష పదవికి శభాష్ పురం ఎంపీటీసీ రాచపాటి రామంజినమ్మ ముందుకు రావడంతో మిగిలిన ఎంపీటీసీ సభ్యులు అందరూ ఆమె ను బలపరిచారు. దీంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి అజయ్ కుమార్ ప్రకటించారు. అనారోగ్య కారణాలతొ పగిడిరాయి ఎంపీటీసీ హనుమరాజు ఆదెమ్మ ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవికి ఉపఎన్నిక నిర్వహించవలసి వచ్చింది. అయితే పగిడిరాయి ఎంపిటిసి హనుమరాజు ఆదెమ్మ ఈ ఉపఎన్నికలలో పాల్గొనలేదు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్, ఈఓఆర్డి శ్రీహరి, జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు (రాంపురం), గీత (ఎద్దులదొడ్డి), తదితరులు పాల్గొన్నారు. ఉపఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సిఐ పులి శేఖర్ ఆధ్వర్యంలో తుగ్గలి, మద్దికేర ఎస్సై లు కృష్ణమూర్తి, విజయ్ కుమార్ నాయక్ లు పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.



## మొలగవల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



ఆలూరు మార్చి 27: ఆలూరు మండలం మొలగవల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉప సర్పంచిగా ఉన్న రంగన్న గతేడాది ఆ పదవికి రాజీనామా చేశారు. బుధవారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో గ్రామానికి చెందిన వార్డు మెంబర్ శాకీరాను వార్డు సభ్యులు ఉప సర్పంచ్ గా చేతులెత్తి ఎన్నుకున్నారు. వైకుంఠం శివప్రసాద్ ఆదేశాలతో లక్ష్మీ రెడ్డి ఆధ్వర్యంలో షకీరాను ఉప సర్పంచ్ గా ఎన్నుకున్నారు. గ్రామభివృద్ధికి కృషి చేస్తానని షకీరా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్ రాజు, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, రామ్నాథ్ యాదవ్, శీనప్ప, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశైలమునకు కాలినడకన వెళుతున్న కర్ణాటక భక్తులకు ఉచిత వైద్య శిబిరం.

### (ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ఆధ్వర్యంలో )




ఆత్మకూర్ మార్చి 27: ఉగాది మహా పర్వదినాన కర్ణాటక నుండి శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ డిస్టిక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో దట్టమైన అడవి పెచ్చెరువు నంద్యాల జిల్లా నందు భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో భక్తులకు మందులు పంపిణీ చేయడం మరియు కాళ్లకు మసాజులు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఎంసీ మెంబర్ శ్రీమతి కే.అరుణ గారు,డి ఎం అండ్ హెచ్ ఓ సిబ్బంది సుభాషిని,దానమ్మ,డిస్టిక్ కోఆర్డినేటర్ రమేష్ బాబు,శ్రీశైలం సేవ సమితి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన ఎన్ఎండి ఫయాజ్



నంద్యాల మార్చి 27: నంద్యాల స్థానిక 38 వార్డ్ వై.యస్.ఆర్ నగర్ టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు స్వగృహం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ సతీమణి, ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్ మాతృమూర్తి షహనాజ్ జ్ఞాపకార్థంగా మరియు రంజాన్ పండుగ సందర్భంగా పేద వితంతు ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులు (రంజాన్ తోఫా) మరియు చీరలు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో మా మాతృమూర్తి జ్ఞాపకార్థంగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు గారిని అభినందించారు. అంతేకాక వార్డు నందు రోడ్లు, డ్రైనేజి, వంటి పనులు తెలుగుదేశం ప్రభుత్వం లోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు అంతేకాక వార్డు నందు ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్న పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చాడు . అనంతరం తాటికొండ బుగ్గ రాముడు ఆధ్వర్యంలో రంజాన్ తోఫా లను స్థానిక పేద ముస్లిం మహిళలకు ముఖ్య అతిధుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్, ఖలీల్ , మున్నా, జోసెఫ్, శ్రీకాంత్ నాయుడు, గోవింద నాయుడు, మహేష్ బాబు, నందం బాబురావు, ముర్తుజావలి , మరాఠీ సూరి, డాక్టర్ కరిముల్ల, షక్షావలి, ప్రసాద్ రెడ్డి, దిలీప్, జాఫర్, ఉమాకాంతయ్య, సురేంద్ర గౌడ్, నారాయణ, ఇమామ్ హుస్సేన్, హుజార్ భాష, ఖాజా తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిన్ అమీర్ ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి...

నంద్యాల మార్చి 27: నంద్యాలలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అమీర్ బాషా ఆధ్వర్యంలో చీరలు, రంజాన్ తోఫా కిట్లను వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పంపిణీ చేశారు.పట్టణం లోని రెండు వేల మంది పేద ముస్లిం కుటుంబాలకు చీరలు, రంజాన్ తోఫా కీట్లను ఉపాధ్యక్షుడు దాల్ మిల్ అమీర్, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ అధికారం ఉన్న లేక పోయినా ప్రతి సంవత్సరం అమీర్ భాష మహిళలకు చీరలు, రంజాన్ తోఫా కిట్లు మహిళలకు అందించడం









అభినందనీయమని,అమీర్ కుటుంబాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు.హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే



ప్రశ్నించాలనీ కోరారు.ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు దేశం




సుధాకర్ రెడ్డి, వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ సోమశేఖర్ రెడ్డి , వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవ నగర్ బాషా, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## గణిత ప్రశ్నాపత్రం లీకేజ్ కుంభకోణంలో సూత్రధారులలో పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

నంద్యాల : మార్చి 27: వేంపల్లి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం పై కేసు లేకుండా లాబీయింగ్,వైసీపీ రాజకీయ ఒత్తిళ్లు కారణమే పాత్రధారులపై కేసులు ప్రైవేటు విద్యాసంస్థల స్వలాభం కోసం ప్రశ్నాపత్రం లీకేజ్ సాక్షాత్తు డిఇఓ గారే వేంపల్లి లో ప్రశ్నాపత్రం లీకేజ్ ను పట్టుపడితే అక్కడి వారిపై చర్యలేవి... ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్ ఆర్జెడి కార్యాలయం ఎదుట ఆర్ఎస్ఎఫ్ ఆందోళన అనంతరం ఆర్జెడి గారు లేకపోవడంతో కార్యాలయం డోర్ కు పత్రం అందజేశారు పదవ తరగతి గణిత ప్రశ్నాపత్రం లీకేజ్ కుంభకోణంలో లో అసలు సూత్రధారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, విద్యాసంస్థలు గుర్తింపు రద్దు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్ డిమాండ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరు లో ప్రశ్న పత్రం లీక్ చేసి, వేంపల్లి కి వాట్సాప్ ద్వారా పంపడం అంటే ముందుగానే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం సిండికేట్ అయి లక్షల రూపాయలు చేతులు మార్చుకొని పక్కా ప్రణాళిక బద్ధంగా చేశారని ఆరోపించారు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కీలక నేత కనుసన్నల్లోనే ఈ వ్యవహారం అంతా నడిచిందని ఆరోపించారు డీఈఓ గారు స్వయంగా వేంపల్లి గర్ల్స్ హైస్కూల్లో వాట్సాప్ లో వచ్చిన ప్రశ్నాపత్రాన్ని లీక్ అయిందని చెప్పారని వీటికి కారణమైన వారిపైన చర్యలకు ఫిర్యాదు చేసిన సందర్భం లేదన్నారు... ప్రశ్న పత్రం లీక్ అయినా వేంపల్లి పరీక్ష కేంద్రంలో ప్రయివేట్ స్కూల్ యూనియన్ నాయకుని ఎక్కువ మంది విద్యార్థులు వున్నారని అక్కడ సర్క్యులేట్ చేసిన ఆ




స్కూల్ యాజమాన్యం. ఈ కుంభకోణంలో పాత్రధారులపై మాత్రమే కేసు నమోదు చేశారని తెలిపారు.ఈ లీకేజీ వ్యవహారం మొత్తం వేంపల్లి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మరో ప్రధానంగా స్కూల్ యాజమాన్యం కీలకంగా వ్యవహరించాలని అందరికీ తెలిసిన వారి పైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డిఇఓ ను ప్రశ్నించారు. వీళ్ళ విద్యా వ్యాపారం కోసం ర్యాంకుల కోసం ముగ్గురు ప్రధాన స్కూల్స్ యాజమాన్యం కుట్ర పద్దారని మండిపడ్డారు. కేసులో ప్రధానమైన సూత్రధారుల పేర్లు లేకుండా యాజమాన్యం లాభం చేస్తూ వీరి వెనకాల వైసీపీ హస్తం ఉందని ఆరోపించారు. తక్షణమే ఆర్జెడి ప్రశ్నాపత్రం లీకేజ్ పై ఎస్పీకి ఫిర్యాదు చేయాలని సూచించారు అసలు సూత్రధారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, నాయకులు సిద్దిక్, వినీల్, వెంకట్, సురేంద్ర రెడ్డి, కార్తీక్, గిరి తదితరులు పాల్గొన్నారు

## ఉండబండ లో తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు.



విడపనకల్లు మండలం మార్చి 27: ఉండబండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో ఎస్సీ కాలనీలో గురువారం ప్రత్యేక పైప్ లైన్లు ఉండబండ గ్రామ తెలుగు దేశం పార్టీ నాయకులు హెచ్ పి వన్నూరు స్వామి ఆధ్వర్యంలో పైప్ లైన్ పనులు ప్రారంభించారు రెండు మూడు రోజుల్లో తాగునీటి పైప్లైన్ పనులు పూర్తిచేసి కాలనీవాసులకు త్రాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు

## వ్యవసాయ ఉపకరణాలను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.





ఆత్మకూరు , మార్చి 27: నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం వెలుగోడు పట్టణంలోని స్థానికవ్యవసాయ సేవా కేంద్రం -3 వద్ద రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందించిన వ్యవసాయ ఉపకరణాలను లబ్ధిదారులకు అందజేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి .

## వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి కోఆప్షన్ నెంబర్ షేక్ చిన్న షాలు ఏకగ్రీవంగా ఎన్నిక

### ఎన్నికలను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య



క్రిష్ణగిరి మండలం మార్చి 27: క్రిష్ణగిరి కో ఆప్షన్ నెంబర్ వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా చిన్న షాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రిష్ణగిరి కోఆప్షన్ నెంబర్ నక్కశాలు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఖాళీగా ఉన్న కో ఆప్షన్ నెంబర్ ను నోటిఫికేషన్ భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో 27వ తేదీన ఎన్నికల అధికారి డాక్టర్ కే వేణుగోపాల్ అధ్యక్షతన కోఆప్షన్ నెంబర్ ఎన్నిక జరిగింది. మండలంలోని 12 మంది ఎంపీటీసీ గాను 11 మంది వైఎస్ఆర్సిపి ఎంపీటీసీలు క్రిష్ణగిరి ఎంపీపీ చిట్యాల ఎంపిటిసి డాక్టర్ కే వెంకటరామిరెడ్డి ఎరుకల చెరువు ఎంపిటిసి కె రామలక్ష్మి ఎస్ హెచ్ ఎర్రగుడి ఎంపిటిసి జి చందనారెడ్డి కటారి కొండ ఎంపీటీసీ డి మురళీధర్ రెడ్డి అమక తాడు ఎంపిటిసి సి ఎల్లమ్మ సిహెచ్ ఎర్రగుడి ఎంపిటిసి కే రాజేష్ కోయిలకొండ ఎంపిటిసి బి కృష్ణయ్య పోతుగల్లు ఎంపీటీసీ పి రాజేశ్వరి బి సుశీల తొగర్చేడు ఏ మహాలక్ష్మి క్రిష్ణగిరి డి రామేశ్వరమ్మ టీ గోగులపాడు

### వీరు హాజరై కో ఆప్షన్ నెంబర్ చిన్న షాలును ఏకగ్రీవంగా



ఏకీభవిస్తూ ఎంపీటీసీలు ఆమోదించారు. దీంతో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. అనంతరం ఎన్నికల అధికారి డాక్టర్ కె వేణుగోపాల్ చేతుల మీదుగా చిన్న షాలుకు ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఈ ఎన్నికను పరిశీలించడానికి జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య హాజరయ్యారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పత్తికొండ సిఐ జయన్న క్రిష్ణగిరి ఎస్సై కె మల్లికార్జున ఆధ్వర్యంలో పర్యవేక్షణలో పోలీస్ సిబ్బందిని గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



ఆలూరు మార్చి 27: ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామ సర్పంచ్ కురువ చముండేశ్వరి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎల్లార్తి గ్రామ ముస్లిం సోదరులకు గురువారం ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. కే. గిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీలేరు బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా బీసీ పురుషోత్తం రెడ్డి.





పీలేరు మార్చి 27: పీలేరు బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా బీసీ పురుషోత్తంరెడ్డి ఉపాధ్యక్షులుగా రామసుబ్బారెడ్డిజి కార్యదర్శిగా చంద్ర శేఖర్. ఎన్నికయ్యారు. గురువారం జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 74 మంది ఎన్నికలోపాల్గొన్నారు.బీసీ పురుషోత్తంరెడ్డికి 46ఓట్లు రాగా ఉపాధ్యక్షులు రామస్వామి రెడ్డికి 26ఓట్లు, కార్యదర్శి చంద్రశేఖర్కు 20ఓట్లు వచ్చాయి. అధ్యక్షులు బీసీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ బార్ కౌన్సిల్ సభ్యులందరికీ కృతజ్ఞతలు. ఎన్నికల్లో పాల్గొని తమ అమాల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని నన్ను అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు.

## స్కూల్ విద్యార్థులకు భద్రత కరువు...

### రోజు రోజుకు పెరుగుతున్న హిట్ అండ్ రన్ ప్రమాదాలు.

### ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న మైనర్లు...


### పందికోన ఈరన్న తెలుగుదేశం పార్టీ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు




కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మార్చి 27: ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందికోన ఈరన్న మాట్లాడుతూ... ఈరోజు ఉదయం హెచ్ పి ఎస్ కాలనీ నుండి నారాయణ స్కూలుకు వెళ్లేటువంటి నాగలదిన్నె రోహిత్ ఏడవ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థి రోడ్డుపై స్కూలుకు వెళుతుండగా అది వేగంగా వచ్చినటువంటి కారు ఆ విద్యార్థిని గుద్దడం జరిగింది.. ముఖ్యంగా ఈ యొక్క వాహనాన్ని మైనర్లు నడపడం జరిగింది.. అక్కడే ఉన్నటువంటి నేను కారు ప్రమాదాన్ని గురైన రోహిత్ ను లేపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగింది... కాబట్టి రోజురోజుకి హిట్ అండ్ రన్ ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి ... మైనర్లకు వాహనాలను ఇచ్చి తల్లిదండ్రులు ప్రమాదాలను ప్రోత్సహిస్తున్నారు. కాబట్టి పోలీస్ శాఖ వారు ఈ వాహనాలు నడిపే మైనర్లపై ఉక్కు పాదం మోపి ప్రమాదాలను నియంత్రించాలని వారిని విజ్ఞప్తి చేస్తున్న.. పదిసార్లు కూడా నేను స్పందనలో ఈ మైనర్ల గురించి అవగాహన కలిగించాలని పలుసార్లు కూడా ఫిర్యాదు చేయడం జరిగింది..దయ చేసి మైనర్లు అవగాహన కలిగించి ప్రమాదాలను నివారించాలని పోలీస్ వారిని మనవి చేసుకుంటున్నా... ఈ కార్యక్రమంలో వాల్మీకి గిడ్డయ్య తదితరులు రోహిత్ ను పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది..

## జిల్లా స్థాయి భూ కేటాయింపుల సమీక్షా కమిటీ పునర్ నిర్మాణం

### రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా



విజయవాడ : జిల్లా స్థాయి భూ కేటాయింపు సమీక్షా కమిటీను పునర్ నిర్మాణం చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు (జి.ఓ. నంబర్లు 1 నుండి 7) రద్దు చేసారు. సి సి ఎల్ ఏ చేసిన ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు .పతునర్రచించిన కమిటీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షత వహించనుండగా, సంబంధిత జిల్లా మంత్రి, జాయింట్ కలెక్టర్ (సభ్య కార్యదర్శి), నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఎమ్మెల్యే, ఆర్‌డిఓ/సబ్ కలెక్టర్ సభ్యులుగా నియమితులయ్యారు. అదనంగా, అవసరమైన సందర్భాల్లో ప్రత్యేక ఆహ్వానితులను కూడా కమిటీకి పిలిచే అవకాశం ఉంది. కమిటీ ప్రధానంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు మరియు మిగులు భూపరిమితి భూములను అర్హులైన భూహీన పేదలకు వ్యవసాయ ప్రయోజనాల కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకోనుంది. అలాగే, భూ కేటాయింపుల్లో మాజీ సైనికుల కోటాపై ప్రత్యేక పరిశీలన చేయాలని కమిటీకి దిశానిర్దేశం ఇచ్చారు. అన్ని జిల్లా కలెక్టర్లు, సి సి ఎల్ ఏ ఈ ఉత్తర్వులను అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్.పీ. సిసోడియా ఆదేశించారు.

## అనంతపురంలో ఘనంగా

## హీరో రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

### రామ్ చరణ్ అభిమాన సంఘ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



అనంతపురం : గ్లోబల్ స్టార్ సినీ హీరో రామ్ చరణ్ జన్మదిన వేడుకలు అనంతపురం నగరంలో ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత మరియు రాంచరణ్ యువశక్తి శ్రీ రవణం స్వామి నాయుడు గారి ఆదేశాల మేరకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా నగరంలో రక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. అనంతపురం నగరంలోని శ్రీ బాలాజీ రెసిడెన్సి లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు భవాని రవికుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రామ్ చరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. దాదాపు 70 మంది మెగా అభిమానులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమా హుస్సేన్ మాట్లాడుతూ మెగాస్టార్ తనయుడుగా చలనచిత్ర పరిశ్రమలో రామ్ చరణ్ నూతన ఒరవడి సృష్టించారని తెలిపారు. ఆయన ఇలాగే ఎన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, భవిష్యత్తులో చిత్ర పరిశ్రమలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ చిరంజీవి అభిమానులు చలపతి, చంద్రమౌళి, సురేష్, శామీర్, షామీర్, శేషాద్రి, గిరీ, రామంజి, వంశీ, చరణ్, కిషోర్, వెంకీ, సంపత్, వరుణ్, అంబేద్కర్ నగర్ నాగేంద్ర, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడుతుంది

### ముస్లింల ఉపవాస దీక్షలు.. క్రమశిక్షణను నేర్పుతాయి

### ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

### ఆత్మకూరులోని పలు మసీదుల్లో ఇఫ్తార్ విందు

### తన సొంత ఖర్చులతో రంజాన్ తోఫా పంపిణీ చేసిన సునీత



అనంతపురం : ముస్లిం మైనార్టీలకు ఎలాంటి కష్టం వచ్చిన నిలబడేది కూటమి ప్రభుత్వమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని పలు మసీదుల్లో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా ముస్లిం సోదరులు, సోదరీమణులతో ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింల చేత ఉపవాస దీక్షలు విరమింపజేశారు. స్వయంగా ఆమె ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు. మసీదుల్లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం 120మంది ముస్లిం కుటుంబాలకు తన సొంత ఖర్చులతో రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ మనకు ఎన్నో నేర్పుతుందన్నారు. కఠిన ఉపవాస దీక్షల ద్వారా క్రమశిక్షణ, దైవ భక్తి, సేవా గుణం వస్తుందన్నారు. సర్వమతాలు ఒక్కటేనని.. సన్మార్గంలో జీవించడమే అల్లా సూచించిన మార్గమని ఎమ్మెల్యే సునీత అన్నారు. పవిత్రమైన సతామి రోజు ఇఫ్తార్ విందులో పాల్గొనడం, రంజాన్ తోఫా అందించడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. మరోవైపు మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి గురించి మొదటి నుంచి ఆలోచించింది తెలుగుదేశం పార్టీనేనన్నారు. ఈ బడ్జెట్ లో కూడా మైనార్టీల కోసం భారీగా నిధులు కేటాయించారన్నారు. త్వరలోనే వారికి సబ్సిడీ రుణాలు, దుల్హాన్ పథకం వంటివి అమలవుతాయని ఎమ్మెల్యే సునీత తెలిపారు...



## నిజాయితీ చాటుకున్న కేసాని మురళీధర్



అనంతపురం, : కే. మురళీధర్ వయస్సు 42 సంవత్సరములు తండ్రి కే. పెద్దన్న అను నతను అర్బిటి స్టేడియం దగ్గర నివాసం ఉంటున్నాడు. గురువారం తన కుటుంబంతో పాటు సరుకులు కొనడానికి ఓల్డ్ క్రిష్ణ థియేటర్ దగ్గర సైడ్ కు నిలబడి ఉన్నపుడు ఎర్రని కవర్లో 2,00,000/- రెండు లక్షల రూపాయలు దొరకడంతో వెంటనే సదరు, కే. మురళీధర్ అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చి సి. ఐ రాజేంద్రనాథ్ యాదవ్ అప్పగించారు. దొరికిన డబ్బులను నిజాయితీతో తీసుకొని అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో హ్యాండ్ ఓవర్ చేసిన కేసాని.మురళీధర్ అనంతపురం జిల్లా ఎస్పీ ఎన్.జగదీష్ అనంతపురం అర్బన్ ఎస్. డి . పీ.ఓ శ్రీనివాస రావు , అభినందించడం అయినది.

## శక్తి యాప్ సేవలు గురించి

## అవగాహన కల్పిస్తున్న శక్తి బృందాల సిబ్బంది

### అనంతపురం రూరల్ మరియు కళ్యాణదుర్గం అర్బన్ పోలీసుల

### ఆధ్వర్యంలో పాఠశాలల ద్యార్థులకు అవగాహన కార్యక్రమం



కళ్యాణదుర్గం : జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో కళ్యాణదుర్గం కేజీబీవీ విద్యార్థులకు. అనంతపురం రూరల్ మండలం కాటిగానికాల్వ, కామారుపల్లి గ్రామాల్లోని మండల ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు వేర్వేరుగా ఆయా పోలీసు అధికారులు మరియు శక్తి టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్ డౌన్లోడ్, ఇన్స్టాల్ ల గురించి ఎస్సై మరియు శక్తి బృందాల సిబ్బంది అవగాహన చేశారు. ఈ సందర్భంగా శక్తి యాప్ సేవలు గురించి వివరించారు. మహిళలు విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ ఒక అయధంగా పనిచేస్తుందన్నారు. కావున ప్రతి ఒక్క మహిళ, విద్యార్థులు ఈ యాప్ ను ఫోన్లో డౌన్లోడ్,రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పలువురు విద్యార్థిని లకు ఆత్మ రక్షణ పై అవగాహన చేశారు. అదేవిధంగా... వేళల్లో శక్తి మొబైల్ యాప్ సేవలుతో పాటు డయల్ 100/112 ఉపయోగాలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లకు సమాచారం చేరవేసి పోలీసు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ ల గురించి అవగాహన చేశారు.

# నాగ్‌పూర్ దారుణం



ఉన్నత విద్యలో చరిత్ర, సాహిత్యం, తత్వశాస్త్రం వగైరా మానవ విజ్ఞాన శాస్త్రాల ప్రాధాన్యత అడుగంటి రెండున్నర దశాబ్దాలు దాటుతుండగా చరిత్రను ఆధారం చేసుకుని నిర్మించినట్టు చెబుతున్న సినిమాలు వివాదాస్పదం కావటం, ఉద్రిక్తతలు ఏర్పడటం ఇటీవలి ధోరణి. తాజాగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రాజుకున్న హింసాకాండ మూలాలు కూడా అక్కడే ఉండటం యాదృచ్ఛికం కాదు. సోమవారమంతా నాగ్‌పూర్‌లో చెలరేగిన హింసలో 33మంది పోలీసులు, అయిదుగురు పౌరులు గాయపడగా రెండు బుల్‌డోజర్లతోసహా అనేక వాహనాలకు దుండగులు నిప్పంటించారు. ఆరో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంస్థలు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పవిత్ర గ్రంథంలోని వాక్యాలున్న చద్దర్‌ను దగ్ధం చేశారన్న వదంతి ఈ హింసకు కారణమని పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ నెల మొదటివారం నుంచే మహారాష్ట్రలో ఉద్రిక్తతలు అలుముకున్నాయి. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో రాసిన ఒక చరిత్రాత్మక నవల ఆధారంగా నిర్మించిన 'ఛావా' సినిమా చుట్టూ తొలుత వివాదం రాజుకుంది. అందులోని ఉదంతాలకు చారిత్రక ఆధారాలు లేవని సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పీ) ఎమ్మెల్యే అబూ అసిమ్ అజ్మీ అనడంతోపాటు ఔరంగజేబు క్రూరుడు కాడన్నారు. ఆపై మరిన్ని మలుపులు తిరిగింది. మరాఠా వారసత్వాన్ని అవమానించిన 'ద్రోహి' అజ్మీని వెంటనే అసెంబ్లీనుంచి బహిష్కరించాలని అధికార మహాయుతి ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ ఘటనల వెనక ముందస్తు పథకం ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అంటున్న మాటలు వాస్తవం. కానీ ఈనెల మొదటివారంలో సమస్య రాజుకున్నప్పటి నుంచి ఇంటె లిజెన్స్ వర్గాలు, పోలీసులు ఏం చేశారు? దుండగుల కదలికలను అంచనా వేయటంలో ఎందుకు విఫలమయ్యారు? పెట్టుబడుల కోసం, అభివృద్ధి సాధించామని చూపటం కోసం ప్రభుత్వాలన్నీ పోటీపడుతున్న కాలంలో శాంతిభద్రతలను దెబ్బతీసే ఇలాంటి ఘటనల వల్ల అప్రదిష్టపాలవుతామన్న స్పృహ కూడా లేదా? హింసకు ఆద్యులెవరన్నది తేలడం తర్వాత సంగతి. ముందు పౌర జీవనం అస్తవ్యస్తమైంది. ప్రతి ఒక్కరూ బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన స్థితి. నాగ్‌పూర్ ఆ రాష్ట్రానికి రెండో రాజధాని. జనాభారీత్యా ముంబై, పుణేల తర్వాత మూడో స్థానంలో ఉంటుంది. 300 ఏళ్ల చరిత్రగల ఈ నగరంలో దేశంలోనే తొలి బట్టలమిల్లును టాటాలు స్థాపించారు. 1920 నాటి నాగ్‌పూర్ కాంగ్రెస్ జాతీయ సదస్సులోనే సహాయ నిరాకరణ ఉద్యమం పురుడు పోసుకుంది. ఇక్కడే హెడ్గేవార్ ఆరెస్సెస్‌ను స్థాపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 1956 అక్టోబర్ 14న బౌద్ధమతాన్ని స్వీకరించి దళిత బుద్ధిస్ట్ ఉద్యమానికి అంకురార్పణ చేసింది ఇక్కడే. ఇది చదువుల తల్లి నిలయం. 1923లో మొదలైన నాగ్‌పూర్ యూనివర్సిటీ సహా ఇక్కడ అయిదు విశ్వ విద్యాలయాలున్నాయి. అయిదు వైద్య కళాశాలలున్నాయి. ఆటోమొబైల్ పరిశ్రమతోపాటు ఇక్కడ ఎన్నో తయారీరంగ పరిశ్రమలున్నాయి. పుణే తర్వాత ఇక్కడే ఐటీ పరిశ్రమలు ఎక్కువ. చరిత్రను మలుపుతిప్పిన అనేకులు ఆనాటి అవగాహన, పరిమితుల మేరకు తమ పాత్ర నిర్వహించి నిష్క్రమించారు. వారి చర్యల వెనకున్న ఆంతర్యమేమిటో, అందువల్ల వివిధ వర్గాలకు కలి గిన ఖేదం లేదా మోదం ఏమిటో...వాటి పర్యవసానాలేమిటో విశ్లేషించి చెప్పటం చరిత్రకారులు చేసే పని. అయితే అలా వెలువడే చరిత్రలు నూరు శాతం వాస్తవమని భావించటానికి వీలుండదు. ఎందుకంటే చరిత్రను వక్రీకరించటం మొదలెట్టి చాన్నాళ్లయింది. ఇక సృజనాత్మకత జోడించి రాసే కాల్పనిక రచనల గురించి చెప్పేదేముంది? శంభాజీ తీరుతెన్నులను నిశితంగా విమర్శించేవీ ఉన్నాయి. ఆయన్ను ఆకాశానికెత్తేవీ ఉన్నాయి. అయితే నేరుగా శంభాజీని కలిసి, సంభాషించిన నికొ లాయ్ మానుచ్చి అనే ఇటాలియన్ తన యాత్రా రచన 'స్టోరియా దొ మొగర్'లో అనేక అంశాలు రాశాడు. అవి కల్పితం అయ్యే చాన్సు తక్కువ. ఔరంగజేబు 49 ఏళ్లపాటు పాలించి తన 88వ యేట 1707లో మరణించాడు. అతని హయాంలో దాదాపు 25 యేళ్లపాటు యుద్ధాలే సాగాయి. ముఖ్యంగా మరాఠాలకూ, మొగల్ సైన్యానికీ మధ్య తీవ్ర వైరం ఉండేది. ఆ క్రమంలో శంభాజీని హత మార్చి, అతని ఏడేళ్ల కుమారుడు సాహూను ఖైదు చేయటం చరిత్రలో చోటుచేసుకున్న వాస్తవిక అంశాలు. పద్దెనిమిదేళ్ల కారాగారవాసం తర్వాత ఔరంగజేబు మరణానంతరం సాహూ విడుదల కావటం, ఆ తర్వాత రాజ్యాధికారం చేపట్టడం, మరాఠాల ప్రాభవం మరింత పెరిగి, ఉపఖండంలో వారు తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకోవటం చరిత్ర. క్రూరత్వమే వీరత్వంగా చలామణి అయిన మధ్యయుగాల్లో ఔరంగజేబు వంటి పాలకుల్లో మంచిని వెదకటంవల్ల కలిగే ప్రయోజనమేమిటో అజ్మీ వంటివారు చెప్పాలి. మహారాష్ట్ర ప్రజలకూ, ముఖ్యంగా మరాఠాలకూ శివాజీతో, ఆయన వారసత్వంతో భావోద్వేగాలతో ముడిపడిన అనుబంధం ఉంటుంది. దాన్ని గాయపరిచి, వివాదాన్ని సృష్టించి ఆయన సాధించదల్చుకున్నదేమిటో అర్థంకాని విషయం. రాజకీయంగా అజ్మీ ఏ పార్టీతో ఉన్నా, ఎంతగా వివాదాస్పదుడైనా బీజేపీ, శివసేనలతోసహా అన్ని పార్టీలతోనూ ఆయనకు సాన్నిహిత్యం వుంది. హత్య కేసు వివాదంలో ఇరుక్కుని మంత్రి పదవి కోల్పోయిన ధనంజయ్ ముండా ఉదంతం నుంచి అధికార కూటమిని కాపాడటానికే ఉద్దేశపూర్వకంగా అజ్మీ ఈ వివాదం రెచ్చగొట్టారని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపణ. ఆ మాటెలావున్నా బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వారు నోరు అదుపులో ఉంచుకోవటం అవసరం. నాగ్‌పూర్ హింస ఈ సంగతినే తెలియజెబుతోంది.

## గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి.

-ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే మెడికల్ క్యాంప్ విజయవంతం చేయాలి.

-ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో మెడికల్ క్యాంప్.

-గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోంది.

-మంత్రి నియోజకవర్గ హిందూ టైగర్ ఇన్చార్జ్ హరీష్ బాబు.



ధర్మవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారంతో ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించనున్నారు. ఈ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించేందుకు ఎన్జీవో హోమ్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలతో పాటు ఇతర ఆరోగ్య సేవా సిబ్బంది హాజరై ఈ మెడికల్ క్యాంప్ నిర్వహణకు అవసరమైన సమగ్ర ప్రణాళికపై చర్చించారు. క్యాంప్‌లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది సమీకరణ, లాజిస్టిక్స్ తదితర అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ హరీష్ బాబు మాట్లాడుతూ........ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సంకల్పంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోంది. ఈ మెడికల్ క్యాంప్ ద్వారా అనేక మందికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది అని అన్నారు. అలాగే ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల పాత్ర కీలకమైనదని, వారు గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, మంత్రి కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తడి చెత్త... పొడి చెత్త పై

## ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు.

-గొట్లూరు లో తడి మరియు పొడి చెత్త పై శిక్షణ.

-పర్యావరణ, పరిరక్షణ, పరిశుభ్రతపై అవగాహన.

-సందర్శించిన మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు.




ధర్మవరం రూరల్ : గొట్లూరు గ్రామంలోని ఎస్ డబ్ల్యు పిసి షెడ్లో గత 4 రోజులుగా తడిచెత్త, పొడి చెత్త నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, గ్రామ స్థాయిలో పని చేసే ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయబడింది. శిక్షణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, సేంద్రీయ ఎరువుల తయారీ, పునర్వినియోగ పరచగల వస్తువుల వర్గీకరణ, వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత, పరిశుభ్రత పెంపు చర్యలు, వ్యర్థాల వర్గీకరణ ముఖ్యమైన అంశాలపై ప్రసంగించారు. ప్రజలు తమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం పొందవచ్చని ఆయన వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం గ్రామ పంచాయతీ, స్థానిక ప్రభుత్వ సంస్థలు, మరియు పర్యావరణ నిపుణుల సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు తమ రోజువారీ వ్యర్థాలను వర్గీకరించి, సమర్థంగా నిర్వహించాలని హరీష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్టా నరసమ్మ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, గ్రామ స్థాయిలో పని చేసే ఇతర అధికారులు, రూరల్ అధ్యక్షులు చంద్రశేఖర్, బిజెపి నాయకులు గొట్లూరు అనిల్, కురుము నారాయణ, సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు, కట్టుబడి వెంకటేష్, రాజు, సుబ్బరాయుడు, రామకృష్ణ, తలారి అంజి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సహాయం...

## మెరుగైన వైద్యం.

-చిన్నారి తలసేమియా శస్త్రచికిత్స కోసం రూ.10 లక్షలు మంజూరు.

-చిన్నారి ప్రాణాలను నిలబెట్టిన మంత్రి.

-సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందజేసిన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు.



ధర్మవరర్ : తలసేమియా సమస్యతో బాధపడుతున్న చిన్నారి శస్త్రచికిత్స కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. ధర్మవరం పట్టణంలోని సంజయ్ నగర్ కు చెందిన పిక్కిలి. లక్ష్మీనారాయణ, పిక్కిలి. రాజేశ్వరి ల 2 సంవత్సరాల కుమారుడు విష్ణు తేజ గత ఒక సంవత్సరం నుండి తలసేమియా సమస్యతో బాధపడుతుండేవాడు. వైద్యుల సలహా మేరకు శస్త్రచికిత్స చేయించాల్సి ఉండగా దానికోసం తగినంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని తమ బాబు చికిత్స కోసం సాయం చేయాల్సిందిగా వారు కోరారు. హైదరాబాదులోని అమెరికన్ ఆంకాలజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారి శస్త్రచికిత్స కోసం మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వెంటనే రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన మంజూరు పత్రంతో పాటు మంత్రి లేఖను మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు గురువారం ఎన్డీఏ కార్యాలయంలో ఆ చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ.... చిన్నారి శస్త్ర చికిత్సకు కావాల్సిన సహాయంతో పాటు మెరుగైన వైద్య సౌకర్యాలను అందించాల్సిందిగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆసుపత్రి వారిని కోరారని, ఆ చిన్నారి శస్త్ర చికిత్స విజయవంతమై త్వరగా కోలుకోవాల్సిందిగా మంత్రి ఆకాంక్షిస్తున్నారని ఆయన తెలియజేశారు. తమ చిన్నారి ప్రాణాలను నిలబెట్టడం కోసం మంత్రి సత్య కుమార్ చేసిన సహాయానికి ఆ చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## తోటి వారికి సాయం అందించడమే అల్లా మార్గం

ముస్లిం మహిళలతో బయాన్ చేయడం ఆనందంగా ఉంది

రంజాన్ సందర్భంగా ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందజేసిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి




నెల్లూరు : మన ఇంద్రియాలను అదుపులో ఉంచుకుంటు తోటి వారికి చేతనైన సహాయం అందించడమే రంజాన్ పర్వదినం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి అన్నారు.గురువారం నగరంలోని స్థానిక గోమతి నగర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమె ముస్లిం మహిళలతో కలిసి బయాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ గొప్పతనాన్ని విశిష్టతను వివరించారు. ముస్లింలు తమ తమ ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా కళ్ళను అదుపులో ఉంచుకుంటూ చెడు చూడకూడదని, చెవులు చెడు వినకూడదని, నోరు చెడు మాట్లాడకూడదు అన్న మంచి సిద్ధాంతాలతో నెలరోజుల పాటు కటోర ఉపవాసాలు చేస్తారన్నారు.గతంలో యాబై నాలుగో డివిజన్లో పర్యటించిన సందర్భంగా రంజాన్ పర్వదినం గురించి తెలుసుకున్నానని చెప్పుకొచ్చారు ఈ సందర్భంగా ఆమె ముస్లిం మహిళలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రంజాన్ తోఫా అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, నగర డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్ కపిర రేవతి, విజయ, శ్రీ లక్ష్మి జానకి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

## రోగులకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంది.

### యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర.




ధర్మవరం. : రోగులకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంది అని యువర్స్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు షీలా నాగేంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల 300 మంది రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా షీలా నాగేంద్ర మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ తరపున 2008 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. దాతల సహాయ సహకారాలతోనే ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. నేటి అన్నదాన కార్యక్రమానికి దాతలుగా మామిళ్ళ ప్రసాద్, జయచంద్ర రెడ్డి, గూండా నాగరాజులు వ్యవహరించడం పట్ల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహాయ సహకారము లేనిదే ఏ కార్యక్రమమూ కూడా విజయవంతం కాదు అని తెలిపారు. యువర్ ఫౌండేషన్ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను కూడా పట్టణ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వై కే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, సభ్యులు సత్రశాల మల్లికార్జున, గీతా లోకేష్, గుండా పుల్లయ్య పాల్గొన్నారు.

## జాతీయస్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని లాస్య రెడ్డి ఎంపిక.

ధర్మవరం.రూరల్. : జాతీయస్థాయి జూడో పోటీలకు ధర్మవరం మండల పరిధిలోని చిగిచర్ల గ్రామములోని ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న లాస్య రెడ్డి ఎంపిక కావడం జరిగిందని హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి, పిడి.ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15 నుండి 17వ తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ జూడో పోటీల్లో లాస్య రెడ్డి అనే విద్యార్థిని 48 కేజీల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడం జరిగిందన్నారు. అనంతరం ఈ విద్యార్థిని జాతీయ పోటీలకు అర్హత సాధించడం జరిగిందన్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఈనెల 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఉత్తరాఖండ్ లో జరిగే జూనియర్ జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. మా పాఠశాలలో చదువుతోపాటు క్రీడల పట్ల



కూడా అత్యంత ఆసక్తి చూపించడం జరుగుతోందని తెలిపారు.ఈ సందర్భంగా హెడ్మాస్టర్ తో పాటు పిడి, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు లాస్య రెడ్డికి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## హీరో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసిన గ్లోబల్ స్టార్ అభిమానులు



ధర్మవరర్. : సేవా కార్యక్రమాలు చేయడమే మా ధ్యేయమని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు, కామేష్, త్రీ లోక్, ఓము దుర్గా, ప్రదీప్, మహేంద్ర, గణేష్, అఖిల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు సినీ యాక్టర్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ హాస్పిటల్ లోని రోగులకు, సాయిబాబా గుడి, గాంధీనగర్, కొత్తపేట, తదితర ప్రాంతాల్లో భోజనపు ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్స్ లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మా హీరో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పలు సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలన్నదే మా ఆకాంక్ష అని తెలిపారు.

## ముస్లిం నిరుపేదల కుటుంబాలకు రంజాన్ నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం.




ధర్మవరం. : ధర్మవరం పట్టణంలోని పిఆర్టి స్ట్రీట్ షాదీ మహల్ లో హజ్రత్ టిప్పు సుల్తాన్ టీం ధర్మవరం సభ్యుల ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ 200 మందికి పైగా నిరుపేదల కుటుంబాలకు రంజాన్ నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని హజరత్ టిప్పు సుల్తాన్ టీం సభ్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా హజరత్ టిప్పు సుల్తాన్ (రహంతుల్లా ఆలై) ధర్మవరం టీం సభ్యుల ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజలకు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కరోనా లాక్డౌన్ సమయంలో దాతల సహకారంతో ఆక్సిజన్ సిలిండర్స్ అందించామని, అదేవిధంగా ప్రతి నెల కొన్ని కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో పేద ప్రజలు సంతోషంగా పండగ జరుపుకోవాలని ఉద్దేశంతో సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామనితెలిపారు. ఈ కార్యక్రమంలో హజరత్ టిప్పు సుల్తాన్ రహంతుల్లా ఆలై ధర్మవరం టీం సభ్యులతోపాటు ధర్మవరం టౌన్ ముస్లిం మైనారిటీ పెద్దలు, మత గురువులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాలలో విద్యా ,ఉపాధి లేక దుర్భర జీవితాలను గడుపుతున్నారు

ఎస్కే యూనివర్సిటీ ఇన్చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ బి అనిత

సాంకేతిక టెక్నాలజీ గిరిజన ప్రాంతాలకు అందించాలి

అప్పుడే వారి జీవితాలలో వెలుగు






అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు " భారతదేశంలో ముఖ్యంగా దుర్భర గిరిజన సమూహాల సామాజిక ఆర్థిక సాధికారిక అవకాశాలు మరియు సవాళు " అనే అంశంపై మొదటి రోజు నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ బి అనిత సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ.... భారతదేశంలో గిరిజనులు దాదాపుగా 8.6% గా ఉన్నారు. ఇప్పుడు ఇప్పటి ఇప్పటికీ వారికి సరైనటువంటి విద్య ఉపాధి అవకాశాలు లేకపోవడం సమాజానికి దూరంగా నెట్టివేయబడి ఉండడం సరైనటువంటి ఆహారము వైద్యము అందుకు దుర్భర జీవితాలను గడుపుతున్నారు కాబట్టి ఇలాంటి సదస్సులు పెట్టడంతో పాటు గీ దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్న గిరిజన తెగల గురించి వాళ్లలో సామాజిక ఆర్థిక పరివర్తన తీసుకురావడానికి సదస్సులు అలాగే సెమినార్లు పరిశోధనలు కృషి చేయాలని ఆకాంక్షించారు. సదస్సుకు విశిష్ట అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ కృష్ణకుమారి ప్రసంగిస్తూ మన భారతదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలలో కూడా గిరిజన తెగలు అలాగే ప్రజలు ఇంకా వెనుకబాటుకు గురవుతూనే ఉన్నారని అండమాన్ నికోబార్ లాంటి ప్రాంతాలలో కూడాను ఇప్పటికీ ఇంకా సరైన మౌలిక వసతులు సదుపాయాలు లేని వారు నివసిస్తున్నారని వారికి మరీ ముఖ్యంగా సైకలాజికల్ ఎంపవర్మెంట్ అందిస్తే బాగుంటుందని మాట్లాడారు.విశిష్ట అతిథిగా హాజరైన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ ఈ రమేష్ బాబు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది అని అన్నారు.కీలక ప్రసంగం చేసిన ఇనిస్ట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ చేంజ్ సెంటర్ ప్రొఫెసర్ కె కృష్ణరాజ్ ప్రసంగిస్తూ, మన భారతదేశంలోనూ అలాగే ఇతర దేశాలలో గిరిజనలు ఎలా సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారో వారి కోసం ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలు మరియు ముఖ్యంగా మన భారతదేశంలో కేంద్ర ప్రభుత్వము అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం ఎలాంటి పథకాలు రూపొందిస్తున్నారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చక్కగా వివరించారు.ఆచార్య బాబయ్య ప్రసంగిస్తూ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మారుతున్న పరిశీలకు అనుగుణంగా సాంకేతిక టెక్నాలజీ కూడాను గిరిజన ప్రాంతాలకు అందించాలని అప్పుడే వారి జీవితాలలో వెలుగు నింపుతాయని పేర్కొన్నారు.సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం ముని నారాయణప్ప ప్రసంగిస్తూ రెండు రోజుల జాతీయ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించడంతోపాటు జాతీయ స్థాయి నుండి దాదాపు 120 మంది పరిశోధకులు పత్రాలు పంపించడం జరిగిందని, పరిశోధన పత్రాలని సెలెక్ట్ కమిటీ ద్వారా ఎన్నిక చేసి రెండు వాల్యూమ్స్ గా ముద్రించడం జరిగిందన్నారు. ఇందులో మొత్తం 92 వ్యాసాలు ఉన్నాయని సెంటర్ అభివృద్ధి కోసం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ క్యాన్సర్ ఆచార్య బి అనిత సహాయ సహకారాలు మరో లేనివి అన్నారు.కార్యక్రమంలో సహాయ సంఖ్యలకులైన డాక్టర్ కే వెంకటరెడ్డి, డి శ్రీనివాసరావు, సిబ్బంది టి కృష్ణారెడ్డి, ప్రశాంత్, డాక్టర్ కొండారెడ్డి, పద్మావతి, నర్మద,వరలక్ష్మి, పరిశోధక విద్యార్థిని విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి పత్ర సమర్పణ చేయడానికి విచ్చేసిన పరశోధకులు హాజరై సభను విజయవంతం చేశారు.మొదటిరోజు సదస్సులో భాగంగా, సెమినార్ పుస్తకాలను శ్రీ కృష్ణదేవ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బి. అనిత చేతుల మీదుగా రెండు వాల్యూమ్స్ ని ఆవిష్కరించారు.

## అభివృద్ధి ఎవరు చేశారో.. నీళ్లు ఎవరు తెచ్చారో నిలదీయండి

ఆత్మకూరు మండల ప్రజలకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు

తలుపూరులో రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

ఎయిర్ పోర్టు గురించి ఆందోళన వద్దు

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్న ఎమ్మెల్యే సునీత





రాప్తాడు : ఆత్మకూరు మండలంలో ఎవరు అభివృద్ధి చేశారో..ఎవరు నీల్లు తెచ్చారో వైసీపీ నాయకుల్ని ప్రజలు నిలదీసి అడగాలని రాప్తాడ ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండలం తలుపూరులో నూతన రోడ్డును ఆమె ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతపురం-కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న సెయింట్ యాన్స్ స్కూల్ నుంచి తలుపూరు గ్రామం వరకు 1.20కోట్ల నిధులతో నిర్మించిన బిటి, సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రచార సమయంలో రోడ్డు కావాలని అడిగిన విషయాన్ని గుర్తు చేశారు. రోడ్డు కచ్చితంగా వేయిస్తామని.. రోడ్డు వేశాకే గ్రామానికి వస్తానని చెప్పానని..ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేయించినట్టు చెప్పారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల నిధులతో హై మాస్ లైట్స్ కూడా ఏర్పాటు చేసినట్టు వివరించారు. గ్రామాల్లో ఇటీవల వైసీపీ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని.. ఇలాంటి వారిని గట్టిగా నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉండగా ఎలాంటి అభివృద్ధి చేయలేదని.. ఇప్పుడు నాయకులు ఇలా మాట్లాడటం ఏంటని ఆమె గట్టిగా నిలదీయాలన్నారు. గ్రామాల్లో కక్షలు సృష్టించే వారుంటారని అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మనం చేసిన అభివృద్ధి గురించి చూపించాలన్నారు. మరోవైపు సంక్షేమ పథకాలు రాలేదన్న ఆలోచన మందిలో ఉందని.. ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని కచ్చితంగా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిహామీని ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ప్రాంతంలో ఎయిర్ పోర్టు వస్తుందని.. మీ భూములు తీసుకుంటారన్న ప్రచారం చేస్తున్నారన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం అలాంటి ఆలోచన చేయలేదన్నారు. కలెక్టర్ల సమావేశంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి గురించి ఎక్కడా చెప్పలేదన్నారు. మీరు ఎవరో చెప్పే పుకార్లు నమ్మవద్దని.. దీనిపై త్వరలోనే కలెక్టర్ ను కలిసి స్పష్టత ఇస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు....

# బీసీ హాస్టల్ విద్యార్థి దుర్మరణం బాధాకరం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

వార్డెన్ సస్పెన్షన్ కు ఆదేశం

విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి

తల్లిదండ్రుల కంట కన్నీరు రానీయొద్దు : మంత్రి సవిత



అమరావతి : గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి మృతిపై విచారకరమని ఆవేదన వ్యక్తంచేస్తూ, విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా వెందుర్తి మండలం గంగలకుంట గ్రామానికి చెందిన బి.కిశోర్ గుంటూరుకు చెందిన వట్టి చెరుకూరు బీసీ హాస్టల్ లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడన్నారు. ప్రమాదవశాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారమందించామన్నారు. హాస్టల్ విద్యార్థుల కదలికలపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహించిన వార్డెన్ శారదా రాణిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. చేతికందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణాతీతమని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

### విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి...

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టంచేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్లలను హాస్టళ్లలో చేర్చుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. వట్టిచెరుకూరు వంటి ఘటనలు చోటుచేసుకోడం క్షమించరాని నేరమన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దని స్పష్టంచేశారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో మంత్రి సవిత స్పష్టంచేశారు.

## ధ్వజారోహణంతో వైభవంగా శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తిరుపతి : తిరుపతి శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.కంకణ బట్టర్ శ్రీ భరత్ కుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 9.15 నుండి 9.30 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ, రామనామ జపముల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతోపాటు సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని అర్చకులు తెలిపారు.అంతకుముందు ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండ రామస్వామివారు, ధ్వజపటము, చక్రతాళ్వారులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు ఆస్థానం జరిగింది.తరువాత ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామివారి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.కాగా, రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు పెద్దశేష వాహన సేవ జరుగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులలో ఒకరైన వేణుగోపాల దీక్షితులు, టీటీడీ ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, శ్రీమతి నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ముని శంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఆత్మీయ ఆహ్వానం




తిరుపతి : తెలుగు వత్సరాది ఉగాది తరువాత తిరుపతిలో జరగనున్న క్షత్రియ సోదరుల ఆత్మీయ సమావేశానికి హాజరు కావలసిందిగా తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజును టీటీడీ క్షత్రియ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకులు రుక్మాంగదరాజు, రుద్రరాజు గురు ప్రసాద్ రాజు, భాస్కర్ రాజు, మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ చైర్మన్ భాస్కర్ రాజు, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ గుండ్రాజు సుకుమార్ రాజులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. టిటిడి నిఘా విభాగపు ముఖ్య భద్రతాధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్ రాజును వారు అభినందించారు. రాజుకు అదనపు బాధ్యతలు అప్పగించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ప్రధాన ముఖద్వారం

నూతనంగా నిర్మించిన ముఖద్వారంను దాతలతో కలసి ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

ముఖద్వారం దాతల్ని అభినందించిన ఎమ్మెల్యే సునీత

స్వామివారి పల్లకీ సేవలో పాల్గొని.. స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే




రాప్తాడు : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ప్రధాన ముఖద్వారాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు.



సుమారు 15మంది దాతలు 15లక్షల రూపాయల వ్యయంతో ఈ ముఖద్వారాన్ని నిర్మించారు. ముందుగా పంపనూరుకు వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలనంతరం దాతలతో కలిసి ముఖద్వారాన్ని ప్రారంభించారు. ముఖద్వారం కోసం విరాళాలు ఇచ్చిన వారిని ఎమ్మెల్యే సునీత అభినందించారు. అనంతరం ముఖద్వారం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి వారి పల్లకీ సేవలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను మోశారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో కూలర్లు, చలివేంద్రాన్ని ప్రారంభించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో మహిమగల శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధి కోసం మరికొంత మంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరుపున కూడా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు..

## ఒక ఉద్యోగి వారంలో ఎన్ని గంటలు పనిచేయగలడు

# నిజంగా 90 గంటలు వర్క్ చేస్తే బతుకుతాడా?



ఓ జాతీయ బ్యాంక్‌లో ఉద్యోగం వస్తే ఎంత బాగుంటుంది. పైగా అందులో వెంటవెంటనే పదోన్నతులు వచ్చేస్తే విన్నవాళ్లకి ఈర్ష్య కలిగేంత అదృష్టంగా తోస్తుంది. కానీ పని ఒత్తిడి వల్ల అదే బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంటే? ఓ యాభై ఏళ్ల క్రితం వరకట్న హత్యల గురించి వార్తలు వినిపిస్తే, ఇప్పుడు పని ఒత్తిడితో ఇలాంటి మరణాల వార్తలు ఎక్కువవుతున్నాయి. సమాజంలో అంతా సవ్యంగా ఉందని ఎలా అనుకోగలం? చదువుతోనో, మహిళలకు ఉద్యోగ స్వేచ్ఛతోనో మనలో పరిపక్వత వచ్చేసిందని ఎలా సంబరపడగలం? అందుకే మరోసారి వృత్తిగత-వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం గురించి మాట్లాడుకోవాల్సిందే! లేకపోతే సంస్థలు, వ్యాపారవేత్తల విజయం కోసం పాటుపడే బడుగు జీవులకు ఆ లాభాల్లో వాటా ఎలాగూ దక్కదు సరికదా%ా% సాయంకాలపు షికార్లు, పిల్లల కబుర్లు, ఇష్టమైన పాటలు, అనుబంధాలు, ఆరోగ్యాలూ అన్నీ చేజారిపోతాయి. నష్టాల పేరుతోనో, వ్యవస్థీకరణ అంటూనో అదే సంస్థ చేయి విదిలించిన రోజు తన భవిష్యత్ గడ్డివాములా చిటికెలో కాలిపోవడం కనిపిస్తుంది. 'మీతో ఆదివారాలు కూడా పనిచేయించుకునే అవకాశం లేకపోవడం దురదృష్టం. అయినా ఇంటికి వెళ్లి ఏం చేస్తారు? ఎంతసేపని పెళ్లాం మొహం చూస్తూ కూర్చుంటారు? నేనైతే వారానికి 90 గంటలు పనిచేస్తాను' దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ ఛైర్మన్ అన్నమాటలివి. 'మన సంస్థను తప్ప నా కుటుంబాన్ని పట్టించుకోను. మీరు కూడా పట్టించుకోవడానికి వీల్లేదు. మీ కుటుంబం ఏమైపోయినా నాకు అనవసరం!' ఓ జూమ్ మీటింగ్‌లో ఉన్నతాధికారి ఇచ్చిన తాఖీదు ఇది. పైకి చెప్పకపోవచ్చు, చెప్పినా అవి బయటికి రాకపోవచ్చు. కానీ, చాలా సందర్భాల్లో ఇలాంటి అభిప్రాయాలే యువతరంతో పనిచేయిస్తున్నాయి. అనే సంస్థ 21-30 ఏళ్ల వయస్కుల్లో ఒత్తిడిని నమోదు చేసే ప్రయత్నం చేసింది. ఇందుకోసం అయిదువేల మందిని ప్రశ్నించగా వారిలో 64 శాతం మంది ఉద్యోగంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని చెప్పుకొన్నారు. విచారించదగ్గ విషయం ఏమిటంటే మగవారితో పోలిస్తే, మహిళలు పని వాతావరణంలో మరింత ఒత్తిడికి లోనుకావడం. ఆఫీసుకు వెళ్లినా కూడా ఇల్లు, పిల్లల బాధ్యత కూడా తనదే అనే తీరు ఇందుకు కారణం కావచ్చు. వ్యక్తిగత జీవితాన్ని మాయం చేసేలా ఈ సమస్య ఎందుకు వస్తున్నది? దాని పర్యవసానాలు, పరిష్కారాలు ఓసారి తెలుసుకోవాల్సిందే!

### సమస్య ఇలా!

ఒకచోట తన పాత్ర, బాధ్యత, ప్రవర్తన%ా% మరో వ్యవస్థను ప్రభావితం చేస్తున్నదంటే కచ్చితంగా వృత్తి-కుటంబాల మధ్య సమన్వయం లోపించినట్టే. కానీ, అసలు సమస్య ఎందుకు వస్తున్నదీ అంటే కొన్ని స్పష్టమైన కారణాలు కనిపిస్తాయి. ఏ పనికి ఎంత సమయం ఇవ్వవచ్చు అనే విశ్లేషణ సంస్థల్లో లేకపోవడం. పై నుంచి వస్తున్న పనిని వచ్చినట్టుగా కొంతమంది ఉద్యోగులతోనే పూర్తి చేయించే ప్రయత్నం. ఉద్యోగిని ఖాళీగా ఉంచకూడదు అనే దృక్పథం. పనిభారం ఎక్కువైనప్పుడు అది ఎంతైనా తట్టుకోవాల్సిందే అనే ఆలోచన. ముందు యంత్రాలు, తర్వాత కంప్యూటర్, తర్వాత కృత్రిమ మేధ ఒక్కో తరంలో ఒక్కో సాంకేతికత పలకరిస్తున్నది. అది వెల్లువలా ముంచెత్తినప్పుడల్లా ఉద్యోగుల మదింపు ఉంటున్నది. వీటికి తోడు కొవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధం లాంటి సందర్భాల్లోనూ ఉపాధికి కోత ఉంటున్నది. ఈ అనిశ్చితిలో ఉద్యోగాన్ని స్థిరంగా ఉంచుకునేందుకు మరింత శ్రమిస్తున్నారు. కొవిడ్ ముప్పు ఎప్పుడో తొలగిపోయింది. కానీ, అది అలవాటు చేసిన వర్క్ ఫ్రం హోమ్ మాత్రం అలాగే ఉండిపోయింది. పేరుకే ఇంట్లోంచి పని. కానీ అన్నివేళలా అందుబాటులో ఉండాల్సిందే. ఆఖరికి కంపెనీలు తెరుచుకున్నా సరే ఇంటికి వెళ్లాక కూడా పనిచేసే సౌకర్యాన్ని యజమానులు వీలైనంత మేరకు వినియోగించుకుంటున్నారు. ఒకప్పుడు కార్మిక సంఘాలు ఉండేవి. ఉద్యోగుల తరఫున మాట్లాడేవి. సంస్థలో కూడా ఉద్యోగుల మధ్య స్పష్టమైన పని విభజన ఉండేది. ఇప్పుడు ఈ రెండు కొరవడటంతో ఎవరితో ఏ పనైనా చేయించవచ్చు, అడిగితే ఊరుకునేది లేదు అనే పరిస్థితి కనిపిస్తున్నది. ఎవరు ఎక్కువ పనిచేస్తే వాళ్లే గొప్ప, వ్యక్తిగత జీవితాన్ని ఎంతలా త్యాగం చేస్తే అంత మంచి ఉద్యోగి, ఆఫీసు పూర్తయినా ఆదివారాలైనా అందుబాటులో ఉండేవాడిదే నిబద్ధత అనే తరహా బ,ావనలం పెరిగిపోవడం.



సమయానికి వచ్చి, సమయానికి వెళ్లిపోవడాన్ని బద్ధకంగా చూసే దృక్పథం. రోజుకు పది గంటలపాటు అజమాయిషీ చేయడం, పది గంటలపాటు శ్రమించడం రెండూ ఒకటే అనే అపోహలో ఉండే యజమానులు తాము పనిచేస్తున్నాం కాబట్టి ఉద్యోగులు కూడా పనిచేయాలని కోరుకోవడం. ఎంతవరకు పనిచేయాలి, చేయడం కుదరదని ఎప్పుడు చెప్పాలి, కుటుంబాన్ని తేలికగా తీసుకోకుండా వారికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వాలి, ఇంట్లో సమయం గడపడం అంటే కాలక్షేపం కాదు కలిసి ఉండటం లాంటి ఎన్నో అంశాల్లో ఉద్యోగులలో అస్పష్టత, అయోమయం.

### నారాయణ మంత్రం

కొన్ని దశాబ్దాల నుంచి, మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంటికీ, ఆఫీసుకీ మధ్య సరిహద్దులు చెరిగిపోయిన పరిస్థితుల నుంచీ వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. పనిగంటల ప్రస్తావనా మోగుతున్నది. కానీ, గత ఏడాది ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఈ పనిగంటల గురించి కొన్ని కఠినమైన అభిప్రాయాలు చెప్పినప్పటి నుంచి వేడి రాజుకుంది. ఓ పాడ్‌కాస్టులో మాట్లాడుతూ మూర్తి 'పేదరికాన్ని తప్పించుకోవాలి అంటే కష్టపడి పనిచేయాల్సిందే అని మా తల్లిదండ్రులు నేర్పారు. ఆ మాటను అనుసరిస్తూ నేను 70 గంటల పనివారాన్ని సూచిస్తాను. ఎన్నో ఏళ్లుగా నేను వారానికి 85-90 గంటలు పనిచేస్తూనే వచ్చాను. పొద్దున 6.20 కల్లా ఆఫీసుకు వెళ్లి, రాత్రి 8:30 తర్వాతే బయటికి వచ్చేవాడిని' అన్నారు. ఈ మాటలు తీవ్రమైన చర్చకు, ట్రోలింగ్‌కి దారితీశాయి. తన కెరీర్‌ను నిర్మించుకునే వ్యక్తికీ, ఇతరుల కోసం చాకిరీ చేసే వ్యక్తికీ మధ్య పనిలో ఉండే ఉత్సాహాన్ని, ఆ పని అందించే ఫలితాలను ఈ సూచన పట్టించుకోలేదన్నది అన్నిటికంటే ముఖ్యమైన విమర్శ. సంస్థల్లో తెలియకుండా పెరుగుతున్న పని ఒత్తిడికీ, యాజమాన్యాల అత్యాశకీ, కరిగిపోతున్న కుటుంబ సమయానికీ ఈ మాటలు ప్రతీక అని చాలామంది భావించారు. కానీ నారాయణమూర్తి మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తన మాటలకు ఎంతోమంది నుంచి అభినందనలు వెల్లువెత్తాయని మురిసిపోయారు. భర్తకు అండగా నిలిచే సుధామూర్తి ఈ వ్యాఖ్యల విషయంలోనూ భర్తను బలపరిచారు. వారానికి 70 గంటలు పనిచేసే అలవాటు తమ కుటుంబం అంతా ఉందని చెప్పారు. కానీ తమ వ్యాఖ్యల పట్ల మధ్యతరగతి కుటుంబాల్లో, సాధారణ ఉద్యోగులలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని గ్రహించారో అప్పుడు మూర్తి స్వరం మారింది. అది తన వ్యక్తిగత అభిప్రాయం అనీ, ఎన్ని గంటలు పనిచేయాలీ అన్నది ఒకరి పరిస్థితులు, ఇష్టాయిష్టాలను బట్టి ఉంటాయని వాటిని బలవంతంగా ఆపాదించలేమని చెప్పుకొచ్చారు.

### స్పష్టమైన సిద్ధాంతాలు!

పారిశ్రామిక విప్లవం మొదలయ్యాక ఎంత త్వరగా, ఎంత ఎక్కువసేపు పనిచేస్తే అంత వేతనం అన్న తీరు మొదలైంది. 'ఒక మనిషికి ఓ పని అప్పచెప్పి రోజంతా చెయ్యమన్నా చేస్తాడు, పావుగంటలో చేయమన్నా చేస్తాడు. కాబట్టి వీలైనంత తక్కువ సమయంలోనే చేయించుకునే ప్రయత్నం చేయాలి' అనే నమ్మకం బలపడింది. దాంతో పనిగంటలు పెరిగిపోయాయి. వాటిని నియంత్రించేందుకు కార్మిక చట్టాలు వచ్చినా కూడా, వాటి ప్రభావం స్వల్పం. పైగా ఇంటర్నెట్, వర్క్ ఫ్రం హోం లాంటి పరిస్థితుల్లో ఏ పని ఎక్కడి నుంచైనా చేయించుకునే సౌలభ్యం వచ్చింది. ఆఫీసు కాస్తా నేరుగా పడకగదిలోకి దూరిపోయింది. దాంతో వృత్తి-కుటుంబాల మధ్య సమన్వయం గురించి రకరకాల సిద్ధాంతాలు మొదలయ్యాయి. వాటిలో కొన్ని బోర్డర్ థియరీ: కుటుంబం, ఆఫీసు, స్నేహితులు, చుట్టాలు మనిషి ఇలా వేర్వేరు సామాజిక వ్యవస్థలలో ఉంటాడు. వీటిమధ్య కదులుతుంటాడు. వీటిలో ఏ ఒక్క వ్యవస్థ తనను కట్టడి చేసినా, ఇతర వ్యవస్థల్లోకి చొచ్చుకుపోయినా సమస్య తప్పదు. బౌండరీ థియరీ: బోర్డర్ థియరీ పరిమితుల గురించి మాట్లాడితే బౌండరీ థియరీ పాత్రల గురించి చెబుతుంది. ఓ తండ్రిగా, భర్తగా, ఉద్యోగిగా, యజమానిగా, మిత్రుడిగా, బంధువుగా, వినియోగదారుడిగా వేర్వేరు పాత్రలలో ఉండే మనిషి వాటిమధ్య అయోమయానికి గురైతే బంధాలు బీటలువారతాయి. ఉదా? ఉద్యోగిగా వచ్చిన చిరాకును భర్తగా చూపించడం. కాంపెన్సేషన్ థియరీ: ఒక వ్యవస్థలో తనకు సంతృప్తి కలగకపోతే మరో వ్యవస్థలో దానికి పరిహారం పొందే ప్రయత్నం చేస్తామనే సిద్ధాంతమే ఇది. ఇంట్లో సమస్యలు ఉంటే ఆఫీసులో మరింతగా కష్టపడటం, బాస్ సరిగ్గా లేకపోతే బార్‌లో సేదతీరడం ఈ కోవలోకే వస్తాయి. ఇన్‌స్ట్రుమెంటల్ థియరీ: ఒక వ్యవస్థలో సంతోషం కోసం మరో వ్యవస్థలో మరింత తీవ్రంగా పనిచేస్తామని సూచించే సిద్ధాంతం ఇది. ఉదాహరణకు కుటుంబంతో కలిసి సెలవులకు వెళ్లేందుకు కొన్నాళ్లు ఆఫీసులో పడీపడీ పనిచేయవచ్చు. జీతం పెంచుతారనే ఆశతో ఇంటిని పట్టించుకోకపోవచ్చు.ఇవే కాదు స్పిల్ ఓవర్, సెగ్మెంటేషన్, ఫోర్ బర్నర్, ఫెసిలిటేషన్ వ్యక్తిగత-వృత్తిగత సమన్వయాల గురించి చాలా సిద్ధాంతాలే ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ చెప్పే మాట ఒక్కటే! కారణం ఏదైనా పని, కుటుంబం రెండిటి మధ్య ఉండే విభజన రేఖ చెరిగిపోతే సమస్యలు తప్పవు. కానీ అలా జరిగిందని తెలుసుకునేదెలా? అందుకు పర్యవసానాలేంటి?

### ప్రమాద సూచికలు!

ఉద్యోగపు ఒత్తిడితో ముందు పాడయ్యేది ఆరోగ్యం. రక్తపోటు పెరగడం, కుంగుబాటు, సంతానలేమి, కూర్చుని కూర్చుని మధుమేహం లాంటి సమస్యలు రావడంతో పాటు చిన్నపాటి వైరస్‌ను ఎదుర్కోలేనంతగా రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని తేలింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ పరిశోధనలో వారానికి 55 గంటలకు మించి పనిచేసేవారిలో గుండెపోటు వచ్చే అవకాశం 13 శాతం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. గాలప్ అనే సంస్థ కనీసం 74 శాతం మంది ఉద్యోగులు ఏదో ఒక సమయంలో తట్టుకోలేని ఒత్తిడిని అనుభవిస్తున్నారనీ, ఓ 23 శాతం అయితే ఏకంగా హాస్పిటల్‌లో చేరుతున్నారని తేల్చింది. ఎక్కువ పనిచేయడం వల్ల ఎక్కువ ఉత్పాదకత పెరగడం అనేది భ్రమే అంటున్నారు. విరామం లేకుండా పనిచేయడం వల్ల 'బ్రెయిన్ ఫాగ్' లాంటి సమస్యలతో ఏకాగ్రత లోపిస్తుంది. నిస్సత్తువ, తలనొప్పి, అయోమయం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఒకప్పుడు దశాబ్దాల తరబడి ఒకే సంస్థలో ఉద్యోగాలు చేసేవారు. కానీ, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ముఖ్య కారణం ఒత్తిడి అని పేర్కొంటున్నారు. ఈ విషయమై 'క్రోనోస్' అనే సంస్థ తలపెట్టిన అభిప్రాయ సేకరణలో 46 శాతం మంది మానవవనరుల అధికారులు ఉద్యోగులు మానేయడానికి ఒత్తిడే ముఖ్య కారణంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితి దీర్ఘకాలికంగా అటు యాజమాన్యానికీ, ఇటు ఉద్యోగులకు కూడా నష్టమే కలిగిస్తుంది. గాలప్ సంస్థ చేసిన మరో సర్వేలో కేవలం 21 శాతం మందే తాము చేస్తున్న పనిని ఇష్టపడుతున్నట్టుగా చెప్పారు. మూడోవంతు మంది మాత్రమే వృత్తితోపాటు వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోగలుగుతున్నట్టు ఒప్పుకొన్నారు. చాలామంది ఎక్కువ పని ఒత్తిడితో జీవితమంటేనే విరక్తి చెందుతున్నారు. ఆర్థిక సమస్యలు ఎదురైనా సరే, ఎంత విలువైన ఉద్యోగాన్నయినా సరే తృణప్రాయంగా వదిలేస్తున్నారు. క్వైట్ క్విటింగ్, గ్రేట్ రెజిగ్నేషన్ లాంటి ట్రెండ్స్ ఇందుకు అద్దం పడుతున్నాయి. పనికి మారుపేరుగా నిలిచే జపాన్‌లాంటి దేశాల్లోనే ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తున్నదంటే పనితో జనం ఎంతగా విసిగిపోయారో అర్థం చేసుకోవచ్చు.

### పరిష్కారాలు ఉన్నాయి!

అనుమానం లేదు. కుటుంబం, ఉద్యోగాల మధ్య వైరుధ్యం స్పష్టంగానే ఉంది. కానీ ఇదేమీ పరిష్కారం లేని సమస్య కాదు. పెద్దల దగ్గర నుంచి వ్యక్తిత్వ వికాస నిపుణుల వరకూ చాలామంది చెబుతున్న సూచనల్లో కొన్ని ముఖ్యమైనవి ఇవీ! ఆఫీసు కూడా కుటుంబంలాంటిదే అని చెప్పడం తేలికే. కానీ ఉద్యోగి తన అసలు కుటుంబానికి కూడా కాస్త సమయం కేటాయించేలా సంస్థలే వెసులుబాటు కల్పించాలి. కచ్చితమైన పనివేళలు, నైపుణ్యానికి తగిన పని, శ్రమకు తగిన గుర్తింపు ఇవేవీ అసాధ్యం కాదు. అవసరం కూడా! సంస్థకు ఏం కావాలి, ఉద్యోగి ఏం చేయాలనుకుంటున్నాడు అనే అంశాల మధ్య సమన్వయం సాధిస్తే పని తేలికైనట్టే! మానవవనరుల విభాగం అంటే కేవలం ఉద్యోగులను నియమించే, తొలగించే, సదుపాయాలు కల్పించే వ్యవస్థగానే ఇప్పటికీ ఉంది. అది యజమానికి అనుగుణంగానే పనిచేస్తుందనే అపప్రథ బలపడుతూనే వస్తున్నది. ఉద్యోగులతో వ్యక్తిగతంగా మాట్లాడటం, వారి ఇబ్బందులను తెలుసుకోవడం లాంటి చర్యలు ఉండాలి. అవసరమైతే ఒక మానసిక నిపుణుడు కూడా అందుబాటులో ఉండాలి. సెలవులను వాడుకోవడం ఓ హక్కు. చేస్తున్న పనికి ప్రతిఫలం. కుటుంబంతో గడిపేందుకు, సేదతీరేందుకు అవకాశం. అందుకే చాలా సంస్థలు సెలవులను పూర్తిగా వాడుకోమంటూ ప్రోత్సహిస్తున్నాయి. షిఫ్ట్ డ్యూటీలలో పనిచేసేవారికి ఈ వర్క్-లైఫ్ సమన్వయం మరింత గడ్డుగా మారుతుంది. వీరికి అమలుచేయాలని సూచిస్తున్నారు. వారంలో నాలుగు రోజులు ఎక్కువ గంటలు పనిచేసి, మిగతా మూడు రోజులు సెలవు తీసుకోవడం ఈ విధానానికి ఓ ఉదాహరణ. ఇంట్లో మొబైల్ ఫోన్ల వాడకం శ్రుతిమించడం వల్ల అందులో ఉండే ఆఫీసు పనుల మీద దృష్టి మళ్లుతుందనీ, అలాకాక కాలక్షేపం కోసం ఫోన్ చూసినా కుటుంబంతో గడిపే సమయం మీద ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఇంటి పనిని పంచుకోవడం వల్ల ఆఫీసు ఒత్తిడిని మర్చిపోతారనీ, కుటుంబంతో బంధాన్ని పెంచుకుంటారనీ పరిశోధనలు చెబుతున్నాయి.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల ఉద్యోగ భద్రత పెరుగుతుంది. తక్కువ పనివేళలతో ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతారు. నచ్చిన సంస్థను ఎంపిక చేసుకోగలుగుతారు. ఆఫీసు రాజకీయాలతో పనిలేకుండా రాణించగలుగుతారు. అలాంటివారి వృత్తి-వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

ఇవి కొన్ని సూచనలు మాత్రమే! సమస్య ఉందీ అని గుర్తించడమే కీలకం. అది స్పష్టమయ్యాక అటు యాజమాన్యాలు, ఇటు ఉద్యోగులు ఏదో ఒక పరిష్కారం కోసం ప్రయత్నించినప్పుడు సవాలక్ష మార్గాలు కనిపిస్తాయి. ఇంట్లో వ్యక్తులు కూడా తమ మధ్యే తిరుగుతూ మధనపడుతున్న ఆ వ్యక్తి బాధను గుర్తించే ప్రయత్నం చేయాలి. 'ఏదో ఆఫీసు గొడవ అయి ఉంటుంది' అని సరిపెట్టుకోకుండా తన బాధను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇంటికి వచ్చాక ఆఫీస్ మెయిల్స్ చూసుకోవడం, అవసరమైనప్పుడు వాటికి జవాబు ఇవ్వడం చాలా చిన్నవిషయంగా తోచవచ్చు. కానీ అలాంటి పనులు కూడా వ్యక్తిగత జీవితంలోకి చొరబాటే అంటున్నది వర్జీనియా టెక్ వెలువరించిన ఓ పరిశోధన పత్రం.

### సైన్స్ చెబుతున్న కబుర్లు

రోజూ కాసేపు వ్యాయామం చేయడం వల్ల మరింత ఆత్మవిశ్వాసంగా, చురుగ్గా పని చేయగలమనీ%ా% తద్వారా ఉద్యోగపు ప్రభావం వ్యక్తిగత జీవితం మీద ఉండదని ఓ 500 మంది మీద జరిగిన పరిశోధనలో తేలింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్ మనుషుల సమస్య మాత్రమే కాదట. పుట్టిన పిల్లల్నీ, వేటనీ చూసుకోవాల్సిన సింహాలుబీ పెద్ద గుంపు మధ్య ఉండే చీమలకు కూడా ఈ ఇబ్బంది ఉన్నదట. డెస్క్ పక్కన ఓ చిన్న మొక్క పెట్టుకోవడం లేదా పనిచేసేవారికి కనిపించేట్టుగా మొక్కలు ఉంచడం వల్ల పని ఒత్తిడి తగ్గి ఇంటికి దగ్గరగా ఉన్న భావన కలుగుతుందని జపాన్‌లోని హ్యోగో విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన చెబుతున్నది. పని ఒత్తిడి ఎక్కువగా ఉండేవారు తమ పిల్లల పోషక అవసరాలను సరిగా తీర్చలేకపోతున్నారని 'టెంపుల్ యూనివర్సిటీ' పరిశోధన నిరూపించింది. 3,700 మంది తల్లిదండ్రులను పరిశీలించాక తేల్చిన విషయమిది.

### నాణ్యత ముఖ్యం

వారానికి 70 లేదా 90 గంటలు పనిచేయాలన్న మాట పెద్ద చర్చకే దారితీసింది. ఈ సందర్భంగా కొందరు వ్యాపారవేత్తలు చెప్పిన అభిప్రాయాలు కూడా ఆసక్తికరంగానే ఉన్నాయి.

1 ఎంతసేపు పని చేశాం అన్నది కాదు ఎంత నాణ్యంగా పనిచేశామన్నదే ముఖ్యం. అయినా ఇంట్లో గడపకుండా, స్నేహితులతో మాట్లాడకుండా, పుస్తకాలు చదవకుండా, ఆలోచించడానికే సమయం ఇవ్వకుండా మనం సరైన నిర్ణయాలను ఎలా తీసుకోగలం? (ఆనంద్ మహీంద్ర %-% మహీంద్ర గ్రూప్ ఛైర్మన్)

2 మన దేశంలో పని సంస్కృతి మారాలి. పై స్థాయిలో వ్యక్తులు కేవలం కబుర్లతోనే ఆగిపోకూడదు. ఆ మాటకు వస్తే ఎక్కువ గంటలు పనిచేయాలనే సిద్ధాంతం వారితోనే మొదలైతే బాగుంటుంది. (రాహుల్ బజాజ్ బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్)

3 నేను వారానికి వంద గంటలు పనిచేసిన రోజులు కూడా ఉన్నాయి. దానివల్ల నా ఆరోగ్యం దెబ్బతిన్నది. ఒత్తిడితో ఏడ్చేదాన్ని. కానీ ఎంత ఎక్కువ పనిచేస్తే అంత ఉత్పాదకత అన్న భ్రమలు తొలగిపోయాయి. ఎంత తెలివిగా, సులువుగా పనిచేస్తామో అంత ఉత్పాదకత వస్తుంది. (రాధిక గుప్త %-% ఎడల్‌వెస్ మ్యూచ్యువల్ ఫండ్ సీఈఓ)

4 అతిగా పనిచేయడం విజయానికి కాదు, అనారోగ్యానికి దారితీస్తుంది. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇవ్వడం అనేది ఓ ఎంపిక కాదు అవసరం. నా దృష్టిలో తెలివిగా పనిచేయడానికీ బానిసలా పనిచేయడానికీ తేడా ఉంది. (హర్ష్ గోయెంకా %-% ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్) పని ఒత్తిడి ఆధునిక జీవితం కోసం చేసిన త్యాగమో, కష్టపడటం వల్ల ఏర్పడే దుష్ప్రభావమో కాదు. దాన్ని ఓ సామాజిక సమస్యగా అందరూ గుర్తించినప్పుడే వ్యక్తికీ,

# అది ఎవరు నిద్రాదేవి




'పండుగ అని కూడా లేదు. ఎప్పుడూ నట్టింట్లో నిద్రపోవడమేనా?' మిట్ట మధ్యాహ్నం సోఫాలో పడుకున్న నిశితతో కోపంగా అన్నాడు మిథేశ్. 'నిద్రాదేవి రమ్మన్నప్పుడు రాదు. వచ్చినప్పుడే పడుకోవాలి' అని కసిరింది నిశిత. 'ఈ మధ్య నీ వ్యవహారం ఏమీ బాలేదు' కరుగ్గా అన్నాడు మిథేశ్. 'నేనేం చేశా?' విసుగ్గా అంది నిశిత. 'సాయంత్రం మీ అమ్మవాళ్ల ఇంటికి వెళ్లి.. అక్కడే దీనిపై మాట్లాడదాం' అంటూ రూమ్‌లోకి వెళ్లి డోర్ వేసుకొన్నాడు మిథేశ్. గంట గడిచింది మిథేశ్ గదిలోంచి వణుకుతూ బయటికి వచ్చిన వంట మనిషి రాము మెట్లు దిగుతూ.. 'అమ్మగారూ.. మన మిథేశ్ బాబును ఎవరో చంపేశారు' అంటూ కేకేశాడు. దీంతో మిగతా ఇద్దరు పనివాళ్లు పరుగెత్తుకొచ్చారు. రాము అరుపులకు వెంటనే నిద్ర మేల్కొన్న నిశిత.. గదిలోకి పరిగెత్తింది. రక్తపు మడుగులో మిథేశ్ పడి ఉన్నాడు. అది చూసి హతాశురాలైంది నిశిత. అరగంటలో క్రైమ్ స్పాట్‌కు రుద్ర అండ్ టీమ్ చేరుకున్నారు. ఏం జరిగిందంటూ అందర్నీ ప్రశ్నించడం మొదలుపెట్టారు. 'ఇంట్లో మొత్తం ఎంతమంది?' నిశితను ప్రశ్నించాడు రుద్ర. 'మిథేశ్, నేను ఇంకో ముగ్గురు పనివాళ్లు' సమాధానం ఇచ్చింది. 'ఇద్దరికి ముగ్గురు పనివాళ్లా?' ఆశ్చర్యపోయాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. 'మా ఇల్లు చాలా పెద్దది సార్. ఇద్దరం ఉద్యోగులమే! ఇంటిని చక్కబెట్టేవాళ్లు, వంట చేసేవాళ్లు.. ఇలా ఉండాలిగా' బదులిచ్చింది నిశిత. 'ముందుగా హత్యను ఎవరు చూశారు?' అడిగాడు రుద్ర. రాము వైపు చేయి చూపించింది నిశిత. 'నీ పేరేంటి?' ప్రశ్నించాడు రుద్ర. 'రాము సార్!' అన్నాడు.. 'ఏం చేస్తావ్?' మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. 'వంటవాణ్ని సార్' అన్నాడు. 'హత్య జరిగిన సమయంలో ఏం చేస్తున్నావ్?' అని ప్రశ్నించాడు. 'సార్‌కు బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేసి గదిలోకి తీసుకెళ్లా సార్.. ఇంతలో ఆయన రక్తపు మడుగులో ఉండటం చూసి భయపడిపోయా. వెంటనే కిందికి వచ్చి అమ్మగారికి చెప్పా' వణికిపోతూనే చెబుతూ ఒక్కసారిగా స్పృహకోల్పోయాడు రాము. వెంటనే అతణ్ని పక్కకు తీసుకెళ్లిన సిబ్బంది.. కాస్త మజ్జిగ అందించారు. మిథేశ్ సిటీలో ఓ పాపులర్ ఆంత్రప్రెన్యూర్ కావడంతో హత్య విషయం దుమారం రేపింది. మిథేశ్ ఇంటి చుట్టూ మీడియా ప్రతినిధులు గుమిగూడారు. అక్కడ అంతా గందరగోళంగా ఉంది. ఇదే సమయంలో అక్కడే ఉన్న పనివాళ్లు రుద్ర దగ్గరికి వచ్చారు. 'సార్.. మేం ఇంటికి వెళ్తాం' అన్నారు. 'ఎందుకు.. అంత అర్జెంట్??' ప్రశ్నించాడు రుద్ర. ఇద్దరూ మిన్నకుండిపోయారు. ఇంటికి వెళ్తామన్న ఇద్దరు పనివాళ్లు దంపతులు. భర్త సుబ్బయ్య తోటమాలిగా పనిచేస్తే.. భార్య శాంతమ్మ ఇంటిని చక్కబెడుతుంది. 'మేడమ్.. మీ భర్త హత్య జరిగిన సమయం సుమారు ఒంటిగంట. అప్పుడు మీరు ఏం చేస్తున్నారు?' నిశితను అడిగాడు రుద్ర. 'మధ్యాహ్నం నాకు నిద్రపోవడం అలవాటు. దీంతో నేను హాల్‌లో పడుకొన్నాను. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికొచ్చిన మిథేశ్.. నాతో ఇదే విషయమై చిన్న గొడవపడ్డాడు. తర్వాత రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకొన్నాడు. ఇలాంటి గొడవలు మాకు ఎప్పుడూ ఉండేవే. దీంతో నేనూ పడుకొన్నాను. గంట-గంటన్నర తర్వాత రాము పరుగెత్తుకొంటూ వచ్చి నన్ను నిద్రలేపాడు. అయ్యగారు చనిపోయారంటూ బోరుమన్నాడ'ని చెప్తూపోయింది నిశిత. 'మీకు ఎవరైనా శత్రువులు ఉన్నారా?' అని రుద్ర అడిగిన ప్రశ్నకు లేరంటూ తలూపింది నిశిత. 'పనివాళ్లు ఎంతకాలంగా ఇక్కడ పనిచేస్తున్నారు?' అడిగాడు. సుమారు ఐదేండ్లుగా అంటూ బదులిచ్చింది. వాళ్లను కూడా ఇంటరాగేషన్ చేయడానికి రుద్ర వెళ్తుండగా.. 'సార్.. వాళ్ల మీద నాకు ఎలాంటి అనుమానం లేదు. ఎందుకంటే ఒంటిగంట సమయంలో శాంతమ్మ స్టోర్ రూమ్‌లో పాత సామాను సర్దుతున్నది. సుబ్బయ్య మొక్కల పని చూస్తున్నాడు' చెప్పింది నిశిత. 'మరి.. రాము?' సూటిగా ప్రశ్నించాడు రుద్ర. 'వాడు.. వంట వండుతున్నాడు' బదులిచ్చింది. నిశిత చెప్పింది నిజమేనన్నట్టు పనివాళ్లు ఇద్దరు తలూపారు. ఇంతలో రాముకు మెలకువ వచ్చింది. హత్య జరిగిన సమయంలో ఏం చేస్తున్నావంటూ అప్పుడే లేచిన రామును రుద్ర ప్రశ్నించాడు. వంట చేస్తున్నట్టు బదులిచ్చాడు. గదిలో ఎలాంటి క్లూస్ దొరకలేదని ఫోరెన్సిక్ టీమ్ చెప్పింది. 'సార్.. ఇది హై ప్రొఫైల్ కేసు. త్వరగా సాల్వ్ చేయాలి' అంటూ రామస్వామి అంటుండగానే.. 'ఇది హైప్రొఫైల్ కేసు.. నిజమే బాబాయ్.. అయితే, లో ఐక్యూతో నేరస్తులు ఇంత త్వరగా దొరుకుతారని అనుకోలేదు' అంటూ రుద్ర నవ్వాడు. ఏమీ అర్థం కాలేదన్నట్టు రామస్వామి విస్తుపోయాడు. ఇంతలో లేడీ కానిస్టేబుల్ నిశితను తమదైన శైలితో విచారించడంతో అసలు విషయాన్ని మొత్తం చెప్పేసింది. అంతకుముందే రాముకు కూడా ఇదే ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో.. నిశిత, తాను కలిసే మిథేశ్‌ను హత్య చేసినట్టు ఒప్పేసుకొన్నాడు. ఇంతకీ, మిథేశ్‌ను నిశిత-రాము కలిసి హత్య చేశారని రుద్ర ఎలా కనిపెట్టినట్టు?

### అది ఎవరు?

మిథేశ్ హత్య జరిగిన సమయం మధ్యాహ్నం ఒంటిగంట. ఆ సమయంలో ఎవరైనా లంచ్ చేస్తారు. అయితే, మిథేశ్‌కు బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వడానికి వెళ్లానని రాము అబద్ధం చెప్పి రుద్రకు అనుమానం కలిగించాడు. మరోవైపు, మిథేశ్ హత్య జరిగిన సమయంలో తాను పడుకొన్నానని, రాము వచ్చి పిలిస్తేనే తనకు మెలకువ వచ్చిందన్న నిశిత.. హత్య సమయంలో పనిమనుషులు ఎవరేం చేస్తున్నారో కరెక్ట్‌గా చెప్పింది. అంటే, ఆమె నిద్రపోవడం అబద్ధమని తేలింది. కాగా, భార్య-భర్తలైన పనివాళ్లు సుబ్బయ్యకు, శాంతమ్మకు అనుమానం రాకుండా రాము, నిశిత కలిసే ఈ హత్య చేశారని, రాముతో తనకున్న అక్రమ సంబంధాన్ని కనిపెట్టిన మిథేశ్ ఎక్కడ దాన్ని బయటపెడతాడోనన్న భయంతో నిశిత ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు విచారణలో తేలింది.

# ఈ రెండు ఇన్ఫెక్షన్లు క్యాన్సర్‌కు ప్రధాన కారణం కావచ్చు

క్యాన్సర్ ఒక ప్రమాదకరమైన, తీవ్రమైన వ్యాధి, ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా సంభవించవచ్చు. దీనికి



సకాలంలో చికిత్స చేయకపోతే, అది మరణానికి కూడా దారితీయవచ్చు. దీని కారణంగా, రోగులు ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. అటువంటి ప్రమాదాలను తగ్గించడానికి, మీరు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ మొదటి దశలో ఉన్నప్పుడు, దాని ప్రారంభ పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. ఈ రోజు మనం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అటువంటి ఇన్ఫెక్షన్ల గురించి తెలుసుకుందాం..

### హెపటైటిస్ బి, సి వైరస్లు

హెపటైటిస్ బి, సి వైరస్‌లు కాలేయ క్యాన్సర్‌కు కారణమయ్యే దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్‌లు. ఈ వైరస్‌లు రక్తం, లైంగిక సంబంధం ద్వారా లేదా తల్లి నుండి బిడ్డకు వ్యాపిస్తాయి. హెపటైటిస్ నివారించడానికి మొదటి క్యాన్సర్ వ్యాక్సిన్ 1985 లో ప్రవేశపెట్టారు. హ్యూమన్ పాపిల్లోమావైరస్ ఈ వైరస్ గర్భాశయ క్యాన్సర్‌తో ముడిపడి ఉంది. ఈ బ్యాక్టీరియా కడుపు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### గర్భాశయ సంక్రమణ

గర్భాశయ ఇన్ఫెక్షన్ విషయంలో సరైన చికిత్స చాలా ముఖ్యం. ఇది వేగంగా కోలుకోవడానికి సహాయపడుతుంది. ఇది తీవ్రమైన రూపాన్ని తీసుకోకుండా సమయానికి ఆపడం చాలా ముఖ్యం. గర్భాశయ సంక్రమణకు సకాలంలో చికిత్స చేయకపోతే, మహిళలు సంతానోత్పత్తి సంబంధిత సమస్యలను ఎదుర్కొంటారు. గర్భాశయ ఇన్ఫెక్షన్ కారణంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. గర్భాశయ ఇన్ఫెక్షన్ కారణంగా గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

### మానవ పాపిల్లోమావైరస్

హ్యూమన్ పాపిల్లోమా వైరస్ అనేది ఒక రకమైన ఇన్ఫెక్షన్, ఇది తరచుగా లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. వైరస్ కణాలలో మార్పులకు కారణమవుతుంది. దీనివల్ల ఈ క్యాన్సర్ కణాలు అదుపు లేకుండా పెరుగుతాయి. ఒక వ్యక్తి శరీరంలో రోగనిరోధక శక్తి బలహీనమైనప్పుడు ఇది జరుగుతుంది. ఆపై శరీరం ఇకపై వైరస్‌తో పోరాడలేకపోతుంది. ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ఆంధ్రజ్యోతి బాధ్యత వహించదు.)

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com